
# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్స్ లేఖలపై శ్రీవారి దర్శనం - తితిదే అనుమతి

5



## 'చేనేత'కు ఉచిత విద్యుత్

- వైఎస్సార్ జిల్లా ఇకపై వైఎస్సార్ కడప జిల్లాగా మార్పు
- ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు ఆమోదముద్ర
- ఎస్సీ వర్గీకరణపై మిశ్రా కమిషన్ నివేదికకు ఓకే
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి భేటీ


3

### ప్రతి నియోజకవర్గానికీ

# ఓ విజన్ డాక్యుమెంట్

- ఎమ్మెల్యే చైర్మన్‌గా అభివృద్ధి ప్రణాళికల అమలు
- స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లాస్థాయి అధికారి నియామకం
- పైలట్ ప్రాజెక్టుగా 4 నియోజకవర్గాలకు విజన్ రెడీ
- త్వరలో మిగిలిన వాటికీ రూపకల్పన
- శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజెంటేషన్
- త్రిభాషా సూత్రంపై రాద్ధాంతం వద్దని హితవు

2





## సీఎం చంద్రబాబును కలిసిన ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్

- ఏఐ సాయంతో గుండె జబ్బులు నిర్ధారించే సిర్కాడియావీ యాప్ రూపొందించిన 14ఏళ్ల బాలుడు
- సచివాలయానికి ఆహ్వానించి అభినందించిన సీఎం

3



## ఆరోపించి... పారిపోతున్నారు!

- మార్షల్స్ సాయంతో గైర్హాజరీలను సభలోకి తేవాలి
- చేయని తప్పునకు చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టారు
- తమ తప్పులు బయటపడతాయనే చర్చ నుంచి పరారవుతున్నారు
- మండలిలో వైసీపీ సభ్యుల వాకౌట్‌పై మంత్రి లోకేష్ ధ్వజం

5



## వీఆర్ వేరు.. సస్పెన్షన్ వేరు

- మండలిలో హోంమంత్రి అనిత వివరణ
- వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం ప్రశ్నకు బదులు

6



## పోలవరం ఎత్తు తగ్గించింది జగన్ సర్కారే

- ఎందుకు తగ్గించారో ఆయనే సమాధానం చెప్పాలి
- ఆగస్టులోపు నిర్వాసిత కాలనీల భూసేకరణ పూర్తి లక్ష్యం
- శాసన మండలిలో మంత్రి నిమ్మల

3

## వాళ్లు.. వాస్తవాలు వినలేరు..!

'రీయింబర్స్‌మెంట్'పై వైసీపీ ఆరోపణలకు మంత్రి లోకేష్ కౌంటర్

రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేస్తామని హామీ

విద్యారంగంపై చర్చ అడిగి.. వైసీపీ గైర్హాజరైందని వ్యాఖ్య

4

# ప్రజా ప్రతినిధుల క్రీడలకు సర్వం సిద్ధం



- శాప్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- వివిధ క్రీడా మైదానాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- నేడు అట్టహాసంగా ప్రారంభం

6

## వైసీపీ పాలనలో 'ఐటీ'ని తరిమేశారు

పెద్దఎత్తున ఐటీ పెట్టుబడులకు కూటమి కృషి

త్వరలోనే మంచి ప్రకటనలు వింటారు: మంత్రి లోకేష్

4

## ప్రయివేట్ వర్శిటీ యాక్ట్ సమీక్షిస్తాం

మన చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధం

చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉంది

యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌కు ఏకీకృత చట్టం

మండలిలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టం

4

# ప్రతి నియోజవర్గానికీ
# ఓ విజన్ డాక్యుమెంట్

- ఎమ్మెల్యే చైర్మన్‌గా అభివృద్ధి ప్రణాళికల అమలు
- స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లాస్థాయి అధికారి నియామకం
- పైలట్ ప్రాజెక్టుగా 4 నియోజకవర్గాలకు విజన్ రెడీ
- త్వరలో మిగిలిన వాటికీ రూపకల్పన
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్
- త్రిభాషా సూత్రంపై రాద్ధాంతం వద్దని హితవు

అమరావతి (చైతన్య రథం): స్వర్ణాంధ్ర విజన్ – 2047 సాధనలో భాగంగా నియోజకవర్గస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వాటిని అమలు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలు సంకల్పం తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా ముందు కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసినట్టు చెప్పారు. సోమవారంనాటి శాసనసభ సమావేశంలో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్–2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల–2047 విజన్ డాక్యుమెంట్‌ను సీఎం ఆవిష్కరించి ప్రజెంటేషన్ ఇచ్చారు. నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్‌ను సఫలీకృతం చేసుకునేందుకు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తున్నామని, దీనికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని తెలిపారు. మండల, మున్సిపాలిటీ విజన్ యాక్షన్ ప్లాన్‌ను గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా తీసుకుని అమలయ్యేలా చూస్తామన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ రూపొందించి కలెక్టర్ల సదుస్సులో విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రతి చివరి వ్యక్తినీ విజన్‌లో భాగస్వామిని చేస్తామన్నారు. ప్రజల ఆకాంక్ష లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ప్రస్తుతం నెలకొన్న సమస్యలు ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలాగా పరిశ్రమలు తరిమేయడం కాకుండా... తీసుకురావడం నేర్చుకోవాలని ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పరిశ్రమలు తేవడంలో మీరూ భాగస్వాములవ్వాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండాలి... అలానే ఉపాధి కలగాలంటే పరిశ్రమలు రావాలి... సేవలరంగం వృద్ధితో ఆదాయం పెరుగుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## వికసిత్ భారత్ బాటలోనే...

వికసిత్ భారత్ –2047 విజన్‌కింద రాష్ట్ర జీడీపీ 30 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం కాగా, తలసరి ఆదాయం 18 వేల డాలర్లు పెట్టుకున్నారు. నిర్దుష్ట లక్ష్యాలతో ముందుకెళ్లే ప్రణాళికతో ఉన్నామన్నారు. వృద్ధిరేటు, తలసరి ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాలు ఉన్నాయి. రాయలసీమ ఎడారిగా మారుతుందని గతంలో అందరూ అనుకున్నారు. కానీ రతనాల సీమగా మారుతోంది. సీమ హార్టికల్చర్ హబ్‌గా మారుతోంది. రాయలసీమ సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీకి కేంద్రంగా మారుతుంది. ఒకప్పుడు అనంతపురం కరవు జిల్లా. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాలు సవాల్‌గా ఉండేవి. కృష్ణానది పక్కనున్న మహబూబ్‌నగర్‌కు నీళు ండేవి కాదు. ఆ రెండు జిల్లాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టేవాడిని. విజయవాడ, శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాలకు నీళ్లున్నా అభివృద్ధిలేదు. కానీ ఇప్పుడు అనంతపురం జిల్లా 26 జిల్లాల్లో 5వ స్థానంలో ఉంది. మొదటిస్థానానికి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు అని సీఎం చంద్రబాబు వివరించారు.

## ప్రతి కుటుంబానికి సొంతిల్లు


నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇస్తాం. గత ప్రభుత్వం సెంటు పట్టాను ఊరికి దూరంగా ఇచ్చింది. దాంతో అవి ఎవరికీ పనికిరాకుండా, చాలీచాలనట్టుగా ఉండటంతో నిరుపయోగమయ్యాయి. సెంటు పట్టా ఉన్నచోటనే స్థలం కావాలంటే రెండు సెంట్లు స్థలం ఇస్తాం. 2029 నాటికి ప్రతి కుటుంబానికి సొంతిల్లు నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు.

## 35 లక్షల మందికి పీ4 ఫలాలు

రాష్ట్రంలో 35 లక్షలమంది అట్టడుగుస్థాయిలో ఉన్నారు. వీరిలో మొదటి దశ కింద 20 లక్షల మందిని, రెండో దశలో 15 లక్షల మందిని పీ4లో భాగస్వాముల్ని చేస్తాం. పేదలను దత్తత తీసుకునే వారికి ప్రభుత్వం తరపున అవార్డులు, గుర్తింపు ఇచ్చి గౌరవిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్‌లో ముఖ్యాంశాలు ఇలా..

## స్వర్ణాంధ్ర- నియోజకవర్గాలు విజన్ 2047

వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర– 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించుకున్నాం. దీనికి అనుగుణంగా ఏటా 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా



పెట్టుకున్నాం. 2047నాటికి రాష్ట్రాన్ని రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఆశయం. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తాం. దీనికి 'సూక్ష్మంనుంచి సూక్ష్మం'అనే విధానాన్ని అనుసరిస్తున్నాం. రాష్ట్రస్థాయిలో, జిల్లాస్థాయిలో, ఇప్పుడు నియోజకవర్గస్థాయిలో విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసి అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాం.

## 2047-48 నాటికి ఆర్థిక వృద్ధి అంచనాలు

వ్యవసాయం– అనుబంధ రంగాల ఆదాయం 2024–25 కాలానికి రూ.5,17,482 కోట్లుంటే 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఈ ఆదాయం రూ.6,02,728 కోట్లవుతుందని అంచనా. 2028–29 నాటికి రూ.8,91,331 కోట్లకు చేర్చడం లక్ష్యం. అలాగే, పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయం 2024–25 కాలానికి రూ.3,40,387 కోట్లుంటే, 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,99,358 కోట్లకు చేరుతుందని అంచనా. 2028–29నాటికి రూ.6,32,748 కోట్లకు చేర్చాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఇక సేవల ద్వారా ఆదాయం 2024–25 కాలానికి రూ.6,12,045 కోట్లుంటే, 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.7,10,714 కోట్లు ఉంటుందని అంచనా. 2028–29నాటికి రూ.11,69,728 కోట్లకు పెరిగేలా చూస్తాం. ఇక 2047–48 నాటికి వ్యవసాయం, అనుబంధరంగాల ఆదాయం రూ.52,56,052 కోట్లు, పరిశ్రమల ఆదాయం రూ.74,00,083 కోట్లు, సేవారంగం రూ.1,55,88,891 కోట్లకు చేరుకునేలా రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను అమలు చేస్తాం. ప్రస్తుత ధరల్లో జీఎస్డీడీపీ 2024–25 కాలానికి రూ.15,93,062 కోట్లుంటే, 2025–26 ఆర్థిక సంవత్సరానికి జీఎస్డీపీ రూ.18,65,704 కోట్లు, 2028–29నాటికి రూ.29,29,402 కోట్లు, అలాగే 2047–48నాటికి రూ.3,08,11,722 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే తలసరి ఆదాయం 2024–25లో రూ.2,98,058 ఉంటే, ఈ ఏడాది రూ.3,47,871, 2028–29లో రూ.5,42,985, 2047–2048 నాటికి రూ.54,60,748కి చేరుకుంటుంది. రాష్ట్ర వృద్ధి 2024–25లో 12.02 శాతం ఉండగా, 2025–26కు వృద్ధి 17.11 శాతం, 2028–29కి 16.23 శాతం, 2047–48కి 11.97 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నట్టు చంద్రబాబు వెల్లడించారు.

## స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలు

ప్రస్తుతం 5.3 కోట్లుగా ఉన్న జనాభా 2047నాటికి 5.8 కోట్లకు చేరుకుంటుంది. అలాగే 70.6 ఏళ్లుగా ఉన్న సగటు జీవితకాలం 85ఏళ్లకు పెరుగుతుంది. పట్టణ జనాభా 36 శాతం నుంచి 60 శాతానికి చేరుకుంటుంది. 100 శాతం అక్షరాస్యత సాధిస్తాం. నిరుద్యోగ రేటు 4.1శాతం నుంచి 2శాతానికి తగ్గనుంది. ఎగుమతులు రూ.1.68 లక్ష కోట్లనుంచి 39.12 లక్షల కోట్లకు వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు.

## స్వర్ణాంధ్రకు పది సూత్రాలు

స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారానికి 10 సూత్రాలు విధించుకున్నట్టు చంద్రబాబు స్పష్టం చేశారు. 1. పేదరికం లేని సమాజం, 2. ఉద్యోగ, ఉపాధి కల్పన, 3. నైపుణ్యం–మానవ వనరుల అభివృద్ధి, 4. నీటి భద్రత, 5. ఫార్మర్ అగ్రిటెక్, 6. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, 7. ఇంధన వనరుల సమర్థ వినియోగం, 8. నాణ్యమైన ఉత్పత్తులు, 9. స్వచ్ఛాంధ్ర, 10. డీప్ టెక్‌గా చంద్రబాబు వివరించారు.


## విభాగాల వారీ థీమ్ విజన్

రాష్ట్ర విజన్, విభాగాల వారీ థీమ్ విజన్, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్, మండలం– మున్సిపాలిటీ విజన్ యాక్షన్ ప్లాన్... ఇలా ఐదు దశల్లో విజన్ ఫ్రేమ్‌వర్క్ రూపొందించుకుంటున్నామన్నారు.

## మండలం-జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్

రాష్ట్రంలోని 686 మండలాలకు సంబంధించి బలాలు, అవకాశాలు గుర్తించాం. మండలస్థాయిలో ప్రాథమిక రంగంపైనా, కీ గ్రోత్ ఇంజిన్స్‌పైనా దృష్టి పెట్టాం. 2028–29కల్లా విభాగాల వారీగా ఐదేళ్ల లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో ఇవి రూపొందించాం. రాష్ట్రంలోని 26 జిల్లాల అభివృద్ధికి

- (మిగతా వివరాలు 3లో)






# 'చేనేత'కు ఉచిత విద్యుత్



- వైయస్సార్ జిల్లా ఇకపై వైయస్సార్ కడప జిల్లాగా మార్పు
- ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు ఆమోదముద్ర
- ఎస్సీ వర్గీకరణపై మిశ్రా కమిషన్ నివేదికకు ఓకే
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి భేటీ

అమరావతి (చైతన్య రథం): వైయస్ఆర్ జిల్లా పేరును వైయస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. సమావేశంలో ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు ఆమోదముద్ర వేశారు. రాజధాని అమరావతిలో భూ కేటాయింపులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం లభించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపైనా కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. ఈ అంశంపై ఇటీవల రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**మరిన్ని కేబినెట్ నిర్ణయాలు..**

నంబూరులో వీవీఐటీయూకు ప్రైవేటు యూనివర్సిటీ హోదా కల్పించాలన్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. పలు సంస్థలకు భూ కేటాయింపులకు మంత్రివర్గం పచ్చజెండా ఊపడమే కాకుండా, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పేరు ఇకపై తాడిగడప మున్సిపాలిటీగా మార్పు చేస్తూ కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల పోస్టుల కు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. బుడగజంగాలు, మరో కులాన్ని ఎస్సీల్లో చేర్చేందుకు తీర్మానం చేయాలని నిర్ణయించింది.

## పోలవరం ఎత్తు తగ్గించింది జగన్ సర్కారే: మంత్రి నిమ్మల

అమరావతి(చైతన్య రథం): పోలవరం కోసం 2014 నుంచి ఇప్పటివరకు రూ.19,396 కోట్లు ఖర్చు చేసినట్లు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. "పోలవరం కోసం కేంద్రం రూ.17,860 కోట్లు చెల్లించింది. ప్రాజెక్టు వల్ల 96,660 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితులకు తొలిదశలో రూ.1,203 కోట్లు అందించాం. ఇంకా 18,266 కుటుంబాలకు రూ.1340కోట్లు చెల్లించాలి. ఇప్పటి వరకు 12,797 నిర్వాసితుల కుటుంబాలను తరలించాం. ఇంకా 27,263 కుటుంబాలను తరలించాలి.


75 నిర్వాసితుల కాలనీల్లో 49 నిర్మాణంలో ఉన్నాయి. ఆగస్టులోపు భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలిదశ ఆర్ అండ్ ఆర్‌ను 26 జూన్‌లోపు పూర్తిచేస్తాం. పోలవరం ఎత్తును జగన్‌హయాంలోనే రెండుగా విభజించారు. పోలవరానికి 41.15 మీటర్ల ఎత్తు ప్రతిపాదన పెట్టింది వైకాపా ప్రభుత్వమే. పోలవరం ఎత్తు ఎందుకు తగ్గించారో జగన్‌నే అడగాలి. నిర్వాసితుల కాలనీల్లో ఒక్కటింటికీ ఆయన హయాంలో పునాది వేయలేదు" అని నిమ్మల రామానాయుడు అన్నారు.



### సీఎం చంద్రబాబును కలిసిన
## ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్

- ఏఐ సాయంతో గుండె జబ్బులు నిర్ధారించే సిర్కాడియావీ యాప్ రూపొందించిన 14ఏళ్ల బాలుడు
- సచివాలయానికి ఆహ్వానించి అభినందించిన సీఎం

అమరావతి (చైతన్య రథం): సీఎం చంద్రబాబును ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్ నంద్యాల కలిశాడు. ఏడు సెకెన్లలోనే గుండె జబ్బులు నిర్ధారించేందుకు ఏఐ సాయంతో సిర్కాడియావీ యాప్‌ను సిద్ధార్థ్ ఇటీవల రూపొందించారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు పరీక్షలు కూడా నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు, సిద్ధార్థ్‌ను కలిసేందుకు ఆహ్వానించారు. సిద్ధార్థ్ ప్రొఫైల్ తెలుసుకుని అభినందించారు. దాదాపు అరగంటపాటు బాలుడితో ముచ్చటించారు. వైద్యరంగంలో సేవలందించేలా ఆవిష్కరణలు చేయాలని, ప్రపంచవ్యాప్తంగా తెలుగుజాతి ఎక్కడున్నా అద్భుతాలు సృష్టించాలని తాను ఎప్పుడూ కలలు కంటుంటానని, వాటిని సిద్ధార్థ్‌లాంటి విద్యార్థులు సాధించిన విజయాలు తనకు ఎంతో సంతృప్తినిస్తాయని అన్నారు. ఏఐలో మరిన్ని ఆవిష్కరణలు చేయాలని సీఎం సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంనుంచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని చంద్రబాబు తెలిపారు. సిద్ధార్థ్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించారు. అనంతపురానికి చెందిన వీరి కుటుంబం 2010లో అమెరికాలో స్థిరపడింది. సీఎంను కలిసిన వారిలో సిద్ధార్థ్ తండ్రి మహేష్, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నారు.



# ప్రతి నియోజవర్గానికీ ఓ విజన్ డాక్యుమెంట్

(2వ పేజీ తరువాయి)

ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నాం. మౌలిక వసతులు, ఇండస్ట్రియల్ కారిడార్లు అభివృద్ధి చేయడంతోపాటు... వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, గవర్నెన్స్‌కు లక్ష్యాలు విజన్ డాక్యుమెంట్‌లో సుస్పష్టంగా ఉన్నాయి.

**నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్**

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల అభివృద్ధికి మైక్రో లెవెల్ ప్లానింగ్ అనుసరిస్తున్నాం. ఫిజికల్ అండ్ సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరాలపై దృష్టి పెడతాం. రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ప్రాజెక్టులు చేపడతాం. కుటుంబస్థాయిలో అభివృద్ధి-సాధికారత సాధించడం, సామాజిక భద్రత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. పీ4 విధానం, జనాభా నిర్వహణ ప్రభుత్వ ప్రాధాన్యాలని చంద్రబాబు పేర్కొన్నారు.

**2029 కల్లా హామీలు నెరవేరుస్తాం**

ప్రతి కుటుంబానికి కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రతి కుటుంబానికి ఇళ్లు, పారిశుధ్య సౌకర్యం, నీటి సరఫరా, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, డిజిటల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిసిటీ, సోలార్ రూఫ్‌టాప్, రహదారుల అనుసంధానం, డ్రైనేజీ నెట్వర్క్, వేస్ట్ టు వెల్త్, స్ట్రీట్ లైటింగ్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**ప్రణాళికల అమలుకు ఫ్రేమ్‌వర్క్**


సచివాలయం, మండలం, మున్సిపాలిటీ, నియోజకవర్గం, జిల్లాలవారీగా విజన్ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. పీ4, జీరో పావర్టీ, బ్లూ ఎకానమీ, నాలెడ్జ్- ఇన్నోవేషన్, పాపులేషన్ మేనేజ్మెంట్‌వంటి థీమ్ స్పెసిఫిక్ టాస్క్‌ఫోర్సులను స్టీరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుంది. చివరి అత్యుత్తమ అధికార కేంద్రంగా లీడర్‌షిప్ కౌన్సిల్ పనిచేస్తుందని అన్నారు.

**సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు**

నియోజకవర్గం స్థాయిలో విజన్ డాక్యుమెంట్ కార్యరూపం దాల్చేందుకు ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యే ఛైర్మన్‌గా, జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తాం. వీరికి సహాయంగా ఒక యంగ్ ప్రొఫెషనల్‌ను, జీఎస్‌డబ్ల్యుఎస్ నుంచి ఐదుగురిని నియమిస్తాం. ఈ మొత్తం వ్యవస్థను నియోజకవర్గ విజన్ మానిటరింగ్ యూనిట్ పర్యవేక్షిస్తుంది. ఎమ్మెల్యే, ప్రత్యేకాధికారికి సమర్థత, జవాబుదారీతనం పెంచేందుకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారం చేసుకుని ర్యాంకులను నియోజకవర్గంవారీగా ఇవ్వడం జరుగుతుంది. నెలకోసారి రాష్ట్రస్థాయిలో ఆయా శాఖలు డిజిటల్ డ్యాష్ బోర్డు ద్వారా పురోగతిని పరిశీలిస్తాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రెండు నెలలకు ఒకసారి, ముఖ్యమంత్రి మూడు నెలలకు ఒకసారి విజన్ డాక్యుమెంట్ అమలును సమీక్షిస్తారని వివరించారు.

**త్రిభాష విధానంలో తప్పేముంది..**

ఇంగ్లీష్ మీడియంతో నాలెడ్జ్ వస్తుందని చెబుతున్నారు. కానీ భాష కేవలం కమ్యూనికేషన్‌కు మాత్రమే. మాతృభాషలో చదువుకున్న వారే ప్రపంచవ్యాప్తంగా రాణించారు. భాష అనేది ద్వేషించడంలో అర్థం లేదు. మాతృభాష తెలుగు, హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్. మన వాళ్లు జపాన్, జర్మనీ, ఇతర దేశాలకు వెళ్తున్నారు. అవసరమైతే ఆ భాషలను మనం నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఎక్కువ ఉపయోగం ఉంటుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.



చైతన్యరథం

# ప్రయివేట్ వర్సిటీ యాక్ట్ సమీక్షిస్తాం

- మన చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధం
- చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉంది
- యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌కు ఏకీకృత చట్టం
- మండలిలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టం

అమరావతి (చైతన్య రథం): ప్రైవేటు యూనివర్సిటీస్ యాక్ట్‌ను సవరించాల్సిన అవసరముందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రయివేట్ వర్సిటీల వివరాలతోపాటు, విశ్వవిద్యాలయ హోదాను ఇవ్వడానికి అనురిస్తున్న ప్రమాణాలు, ప్రభుత్వ నియంత్రణపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 2016లో ఆనాటి ప్రభుత్వం ప్రయివేట్ వర్సిటీల స్థాపనకు ప్రత్యేక చట్టం తీసుకురావడం జరిగింది. అందులో భాగంగానే విట్, ఎస్ఆర్ఎం, సెంచూరియన్, క్రియా యూనివర్సిటీ రాష్ట్రానికి వచ్చాయి. విట్, ఎస్ఆర్ఎం అమరావతిలో నెలకొల్పగా.. సెంచూరియన్ విజయనగరానికి, క్రియా యూనివర్సిటీ నెల్లూరు జిల్లాకు రావడం జరిగింది. అభివృద్ధి వికేంద్రీకరణకు ఆనాడు కూడా కట్టుబడి చేసి చూపించామనేందుకు ఇదొక ఉదాహరణ. చట్టానికి ఐదుసార్లు సవరణ చేయడం జరిగింది. అందులో భాగంగా బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీస్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే దిశగా గత ప్రభుత్వం పనిచేసింది. 4 యూనివర్సిటీలు.. మోహన్‌బాబు యూనివర్సిటీ, హనుమాచార్య యూనివర్సిటీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, ఆదిత్య యూనివర్సిటీలు బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీస్ కింద వచ్చాయని మంత్రి వివరించారు.

## యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా చట్టం ఉంది

ఈ యాక్ట్‌లో చేసిన సవరణలవల్ల ఇక రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీలు వచ్చే పరిస్థితి లేదు. ఈ యాక్ట్ యూజీసీ రెగ్యులేషన్స్‌కు విరుద్ధంగా ఉంది. ప్రధానంగా కంపల్సరీ జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీస్ అనేది మాన్‌డేటరీగా పెట్టారు. దీంతో కనీసం 30శాతం కోర్సు.. టైఅప్ అయిన ఫారిన్ యూనివర్సిటీస్‌లో చదవాలనే నిబంధన పెట్టారు. యూజీసీ మాత్రం ఒప్పందం చేసుకోవాలంటే కచ్చితంగా ఆ సంస్థలకు న్యాక్ అక్రిడేషన్ ఉండాలని చెప్పింది. కనీసం రెండు గ్రాడ్యుయేట్ బ్యాచ్‌లన్నా, 6 ఏళ్ల ఎగ్జిస్టెన్సీ ఉండాలని, వెయ్యికి పైగా పబ్లికేషన్స్ చేసుండాలి, క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఇన్‌స్టిట్యూషన్స్ కనీసం 3 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్‌లు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో కనీసం 3 గ్రాడ్యుయేటింగ్ బ్యాచెస్ ఉండాలని యూజీసీ చెబుతోంది. మనం చేసిన చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంవల్ల మనకు ప్రైవేటు రంగంలో విశ్వవిద్యాలయాలు రాకుండా పోయాయి. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో.. ఏపీలో 36.5శాతం ఉంది. తమిళనాడులో 47శాతం, కేరళలో 41.3శాతం ఉంది. దీనిపై దృష్టిసారించాం. ఏపీ సెట్ ద్వారా 35శాతం సీట్లు భర్తీ చేయడం జరుగుతుంది. మిగతా 65 శాతం సీట్లు మెరిట్ ప్రకారం భర్తీ చేస్తారు.



ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విషయానికి వస్తే అడ్మినిస్ట్రేషన్ పర్పసెస్ కోసం యూనిఫైడ్ యాక్ట్ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నామని లోకేష్ వివరించారు.

## ప్రైవేటు యూనివర్సిటీస్ యాక్ట్‌ను సమీక్షిస్తాం

ప్రైవేటు విశ్వవిద్యాలయాల యాక్ట్‌ను సమీక్షిస్తున్నాం. మంచి విశ్వవిద్యాలయాలు రావాల్సి ఉంది. అమరావతిలో బిట్స్ వచ్చేందుకు సిద్ధంగా ఉంది. కేంద్రం కూడా ఫారిన్ యూనివర్సిటీలను దేశంలో పెద్దఎత్తున ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తోంది. మనం చేసిన చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. దానిని సవరించాల్సిన అవసరం ఉందని మేంబలంగా నమ్ముతున్నాం. దీనిపై పూర్తిస్థాయిలో మేం చర్చించడం జరుగుతోంది. త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ల విషయానికి వస్తే.. గవర్నెన్స్ కోసం గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ (గిగ్)ను కేబినెట్‌లో ప్రతిపాదించడం జరిగింది. ఇందుకోసం సబ్ కమిటీని నియమించడం జరిగింది. నేను, మంత్రి నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు బాధ్యత పెట్టారు. రీసెర్చ్ పేపర్ కూడా మేం తయారుచేశాం. టోనీ బ్లెయర్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి గుడ్ గవర్నెన్స్ కోసం ప్రపంచస్థాయి శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. పరిశోధన అనేది చాలా అవసరం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో పీహెచ్‌డీ విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారు. తమిళనాడులో మనకంటే నాలుగురెట్లు ఎక్కువగా ఉన్నారు. ఇందుకు పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక కారణం. దీనిపై అధ్యయనం చేస్తున్నాం. ఏఐ, హ్యూమనాయిడ్స్, డీప్ టెక్‌పై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. అమరావతిలో డీప్ టెక్ సంస్థను నెలకొల్పాల్సిన అవసరం ఉంది. విశాఖలో ఏఐ యూనివర్సిటీ నెలకొల్పుతాం. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని లోకేష్ వివరించారు.

## గంజాయి, డ్రగ్స్ అణచివేసే విషయంలో కఠినంగా ఉంటాం

గంజాయి, డ్రగ్స్ అణచివేసే విషయంలో కూటమి ప్రభుత్వం కఠినంగా ఉంటుంది. ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో పనిచేసే పోలీసు సిబ్బందికి అదనంగా 30శాతం జీతాలు ఇస్తూ జీవో కూడా జారీచేయడం జరిగింది. సాంకేతిక సాయం కూడా అందిస్తున్నాం. ప్రతి యూనివర్సిటీ, స్కూల్స్‌లో ఈగల్ కమిటీలు ఏర్పాటుచేసి చైతన్యం

# వైసీపీ పాలనలో 'ఐటీ'ని తరిమేశారు

- పెద్దఎత్తున ఐటీ పెట్టుబడులకు కూటమి కృషి
- త్వరలోనే మంచి ప్రకటనలు వింటారు: మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): వైసీపీ పాలనలో ఐటీ కంపెనీలను రాష్ట్రంనుంచి తరిమేశారని, కూటమి పాలనలో పెద్దఎత్తున ఐటీ పెట్టుబడులకు కృషిచేస్తున్నామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఏపీఐఐసీ ద్వారా విశాఖపట్నంలో ఐటీ పార్క్‌ల్లో పరిశ్రమలు స్థాపించడానికి ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన భూములు, కంపెనీల వివరాలు, ఉద్యోగ నియామకాలు, పీఎఫ్‌వంటి ఒప్పంద నిబంధనలపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విశాఖపట్నంలో ఐటీ పార్క్‌ల్లో ఏపీఐఐసీ ద్వారా 54 కంపెనీలకు 295.68 ఎకరాలు కేటాయించడం జరిగింది. ఐటీ సెక్టార్ చాలా కీలకం. త్వరలోనే మంచి ప్రకటనలు రాబోతున్నాయి. భూకేటాయింపుల విషయానికి వస్తే.. ఐటీ కంపెనీలకు ప్రధానంగా భూములు కేటాయించడం జరిగింది. ఐటీ కంపెనీలను పెద్దఎత్తున ప్రోత్సహించాం. అనవసరమైన నిబంధనలు పెట్టలేదు. అవుట్ సోర్సింగ్ కంపెనీల విషయానికి వస్తే బీపీవోస్‌ను ఒకరకంగా చూస్తాం. రెండోది గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ కోసం (జీసీసీ).. అంటే ఫార్చ్యూన్-2500 కంపెనీలకు ఒకరకమైన ప్రోత్సహకాలు అందిస్తాం. మూడోది దేశంలోని పెద్ద కంపెనీలు.. టీసీఎస్, కాండ్యుయెంట్, విప్రో, ఇన్ఫోసిస్, డెలాయిట్ లాంటి సంస్థలకు ఒకరకమైన కేటాయింపులు చేస్తాం. డెవలపర్స్ కూడా ఉన్నారు. నిబంధనలకు అనుగుణంగా భూముల



కేటాయింపు, వాటి వినియోగం జరుగుతుంది. మేం టాప్-100 డెవలపర్స్, ఐటీ కంపెనీలు, బీపీవోస్‌తో సంప్రదింపులు చేస్తున్నాం. ఫార్చ్యూన్-2500 కంపెనీలతో సంప్రదింపులు చేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో కొంత భూమిలో కమర్షియల్ యాక్టివిటీస్‌కు కూడా అనుమతిస్తున్నాం. కంపెనీలకు ఇంటిగ్రేట్ యాక్టివిటీ, ఫుడ్ కోర్ట్స్, బేసిక్ రీటైలింగ్ యాక్టివిటీస్ ఉంటాయి. ఇందుకోసం అనుతిస్తామని లోకేష్ ఉద్ఘాటించారు.

## ఐటీ కంపెనీలను వైసీపీ తరిమేసింది

జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఐటీరంగం తిరోగమనంలో ఉంది. పీపీఏలను రద్దు చేశారు. నాపై కోపముంటే తీర్చుకోవాలి. రాష్ట్రాన్ని నష్టపరిచారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఒక ఫార్చ్యూన్-500 కంపెనీ యజమానిపై వైసీపీ ఎంపీలు పార్లమెంట్ సాక్షిగా ఆరోపణలు చేశారు. దీంతో ఆ కంపెనీ ఇబ్బంది పడింది. వైజాగ్ వదిలి పారిపోయింది. ఇప్పుడు 54 కంపెనీల్లో 41 కంపెనీలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. 11,496మంది పనిచేస్తున్నారు. వారికి పీఎఫ్ చెల్లిస్తున్నారు. ఐటీ కంపెనీల రాకపై రాబోయే రోజుల్లో సంచలన ప్రకటనలు చూస్తారు. కేవలం హైదరాబాద్‌తోనే కాదు. జైపూర్, భువనేశ్వర్‌తో మనం పోటీపడుతున్నాం. ఏపీలో పెద్దఎత్తున ఐటీ పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి సారిస్తున్నాం. కంపెనీలను పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కంపెనీలు రియల్ ఎస్టేట్ చేయలేవనే విషయాన్ని గమనించాలి. టీసీఎస్ విషయంలో ఇప్పటికే ప్రకటన చేశాం. త్వరలోనే వైసీపీ ఖాళీగా పెట్టిన మిలీనియం టవర్స్‌లోకి వస్తున్నారు. వారికి భూములు కూడా కేటాయిస్తాం. దావోస్‌లో కాగ్నిజెంట్, ఇతర కంపెనీలతో కూడా సంప్రదింపులు జరిపాం. కాగ్నిజెంట్‌పై త్వరలోనే ప్రకటన చేయనున్నామని మంత్రి చెప్పారు.

# వాళ్లు.. వాస్తవాలు వినలేరు..!

- 'రీయింబర్స్‌మెంట్'పై వైసీపీ ఆరోపణలకు మంత్రి లోకేష్ కౌంటర్
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేస్తామని హామీ
- విద్యారంగంపై చర్చ అడిగి.. వైసీపీ గైర్హాజరైందని వ్యాఖ్య

అమరావతి (చైతన్య రథం): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వాస్తవాలను వినే పరిస్థితిలో వైసీపీ లేదని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థికసాయంపై మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నలకు సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సమాధానం ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో వైసీపీ అవాస్తవాలు ప్రచారం చేస్తుండటంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కలుగచేసుకుని వైసీపీ సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టారు. మంత్రి మాట్లాడుతూ.. విద్యారంగంపై శాసనమండలిలో చర్చ జరిగితే వైసీపీ సభ్యులు ఎందుకు బయటకు వెళ్లారు? ఈ విషయాలన్నీ ఆ రోజు చెప్పాం. మీరెందుకు బాయ్‌కాట్ చేశారు? ఆ రోజు జరిగిన చర్చలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చాలా స్పష్టంగా చెప్పాం. వినకుండా, చదవకుండా మళ్లీ ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నోట్ పంపిస్తాను, ఒకసారి చదవాలి. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వాస్తవాలు చెబుతుంటే దానిని కూడా ఓర్చుకోలేక పోతున్నారు. వైసీపీ హయాంలో రూ.4,200 కోట్లు బకాయిలు పెట్టారు. అవునో, కాదో చెప్పాలి. వివరాలు పంపిస్తాం. స్కూల్ ఫీజు రీయింబర్స్‌మెంట్, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వివరాలన్నీ అందులో ఉన్నాయి. 2019లో ఆనాటి ప్రభుత్వం పెట్టిన బకాయిలను 16 నెలల తర్వాత వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలే అయింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కచ్చితంగా చెల్లిస్తాం. హౌస్ సాక్షిగా హామీ ఇచ్చాను. చర్చలో వైసీపీ సభ్యులు లేకపోతే నేనేం చేయగలను. బీఏసీలో విద్యారంగంపై చర్చ కావాలని అడిగితే ఒప్పుకున్నాం. కానీ ఆ చర్చకు వైసీపీనే లేదు. వాస్తవాలు వినడానికి సిద్ధంగా లేరు. ప్రభుత్వం ఇచ్చిన వివరాలు పూర్తిగా చదవాలని లోకేష్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడిందని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. వసతి దీవెన ఏనాడూ సక్రమంగా చెల్లించలేదని మండిపడ్డారు.

# ఆరోపించి... పారిపోతున్నారు!

- మార్షల్స్ సాయంతో గైర్హాజరీలను సభలోకి తేవాలి
- చేయని తప్పునకు చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టారు
- తమ తప్పులు బయటపడతాయనే చర్చనుంచి పరారవుతున్నారు
- మండలిలో వైసీపీ సభ్యుల వాకౌట్‌పై మంత్రి లోకేష్ ధ్వజం

అమరావతి (చైతన్య రథం): వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు ప్రయత్నించారని, ఇప్పుడు ఆ అంశంపై చర్చలో పాల్గొనకుండా ఆరోపణలు చేసి పారిపోతున్నారని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. శాసనమండలిలో 2019-24 మధ్య అవినీతి, అక్రమాలపై చర్చను నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు.

దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది. అందరూ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. 2019-24 మధ్య జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాల అంశంపై చర్చకు అనుమతిస్తూ మండలి ఛైర్మన్ ఆదేశాలు జారీచేశారు. బీఏసీలో వైసీపీ సభ్యులు అంగీకరించారు. చర్చలో వైసీపీ సభ్యులు 2014-19 మధ్య జరిగిన పాలనపై ఆరోపణలు చేసి.. ఇప్పుడు సమాధానం ఇస్తుండగా వాకౌట్ చేస్తున్నారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతారు. సమాధానానికి సమయమివ్వరు. మేం సమాధానం ఇచ్చే సమయంలో సభలో ఉండరు. ఇది మొదటిసారి కాదు. పదేపదే ఇవిధంగా చేస్తున్నారు. ఇది సరికాదు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గతంలో మార్షల్స్‌ను పెట్టి సభను నడిపించిన పరిస్థితి. ఇప్పుడు మార్షల్స్‌ను పెట్టి బయట ఉన్న సభ్యులను



సభకు తీసుకురావాలి' అని మంత్రి లోకేష్ ఛైర్మన్‌ను కోరారు. ఆ అధికారం ఛైర్మన్‌కు ఉందన్నారు. 2014-19 మధ్య పాలనపై వైసీపీ సభ్యులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి కేసులు పెట్టారో చూశాం. చేయని తప్పునకు చంద్రబాబును 53 రోజులపాటు జైల్లో పెట్టారు. మొదట రూ.3వేల కోట్ల కుంభకోణం అన్నారు. తర్వాత రూ.300 కోట్లని, తర్వాత రూ.27 కోట్లని అన్నారు. చేయని తప్పునకు జైలుకు పంపారు. అచ్చెన్నాయుడుని, ధూళిపాళ్ల నరేంద్రను, కొల్లు రవీంద్ర, నారాయణ.. అందరినీ ఇబ్బంది పెట్టారు. చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. ఇవన్నీ బయటపడతాయని భయపడుతున్నారా? ఆరోపణలు చేసి పారిపోతున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మా నాయకులు చేయని తప్పులకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు యత్నించారు. కేసులపై చర్చించాలి. నాపైనా 23 కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. హత్యాయత్నం కేసు పెట్టారు. చర్చకు లేకుండా పారిపోయారు. ఇది సరికాదన్నారు. మార్షల్స్‌ను పెట్టి బయటకు వెళ్లిన వైసీపీ సభ్యులను లోపలికి తీసుకురావాలని మంత్రి లోకేష్ మండలి ఛైర్మన్‌ను కోరారు.

## పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్

ఢిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటుకు ఆమోదం లభించింది. రెండు కాంప్లిమెంటరీ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు లోక్‌సభ సచివాలయం అనుమతి ఇచ్చింది. పార్లమెంట్‌లోని సంసద్ భవన్‌లో సంగం, నలంద లైబ్రరీ వద్ద సభ్యులకు ఇబ్బంది లేకుండా స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపింది. అరకు కాఫీకి ప్రచారం కల్పించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం పార్లమెంట్ ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతివ్వాలని తెదేపా ఎంపీలు గతంలో స్పీకర్ ఓంబిర్లాను కోరారు. ఎంపీల విజ్ఞప్తి మేరకు స్టాల్స్ ఏర్పాటుకు స్పీకర్ అనుమతి ఇచ్చారు. ఈ మేరకు లోక్‌సభ డిప్యూటీ కార్యదర్శి అజిత్ కుమార్ సాహూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు లేఖ ద్వారా వెల్లడించారు. అరకు కాఫీ గురించి మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ సైతం గతంలో ప్రస్తావించిన విషయం తెలిసిందే.

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం

### - తితిదే అనుమతి

తిరుమల (చైతన్య రథం): తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వెల్లడించింది. ఈ మేరకు తితిదే ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆది, సోమవారం (సోమ, మంగళవారం దర్శనాలకు) మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపింది. బుధవారం, గురువారం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు (ఏ రోజుకు ఆ రోజే) లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేసింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే (ఆరుగురు భక్తులకు మించకుండా) స్వీకరిస్తామని వెల్లడించింది. ఈ విధానం మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికిగాను ఆదివారం ఏపీ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు స్వీకరిస్తున్నారు. ఇకపై శనివారం (ఆదివారం దర్శనం కోసం) స్వీకరించనున్నట్టు తితిదే పేర్కొంది. తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలు, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో పెట్టుకొని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని తిరుమల తిరుపతి దేవస్థానానికి సహకరించాలని కోరింది.

## సీఐడీ కస్టడీకి పోసాని

### - అనుమతించిన కోర్టు

గుంటూరు (చైతన్య రథం): వైకాపా నేత, సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని కోర్టు ఒక రోజు కస్టడీకి అనుమతించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు పోసానిని మంగళవారం ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 గంటలవరకు సీఐడీ కస్టడీకి తీసుకొని ప్రశ్నించనుంది. మీడియా సమావేశంలో అసభ్య పద జాలంతో దూషించినందుకు పోసాని పై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

సీఐడీ నమోదు చేసిన కేసులో ప్రస్తుతం పోసాని గుంటూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు మంగళవారం పోసాని బెయిల్ పిటిషన్‌పై గుంటూరు కోర్టులో విచారణ జరగనుంది.

## ప్రత్యర్థులను భయపెట్టేందుకే రామకృష్ణ హత్య: జిల్లా ఎస్పీ

చిత్తూరు (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ కార్యకర్త రామకృష్ణ హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వెంకటరమణతోపాటు రెడ్డప్పరెడ్డి (ఏ5)ని అరెస్టు చేసినట్టు చిత్తూరు ఎస్పీ వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈమేరకు కేసు వివరాలను చిత్తూరు ఎస్పీ మీడియాకు వెల్లడించారు. "ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురి చేసేందుకే రామకృష్ణను హత్య చేశారు.

నిందితుడు రెడ్డప్పరెడ్డి.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు. హత్యకు ముందు వైకాపా ముఖ్య నేతలతో నిందితుడు ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించాం. నిందితులు భూ ఆక్రమణలు, బెదిరింపులకు పాల్పడినట్లు ఆధారాలున్నాయి. వీరి అక్రమాలపై పోరాటం చేస్తున్నందుకే హత్య చేసినట్లు అనుమానిస్తున్నాం" అని ఎస్పీ వెల్లడించారు. జిల్లాలోని పుంగనూరు మండలం కృష్ణాపురంలో మార్చి 15న రామకృష్ణను హత్య చేసిన విషయం తెలిసిందే.

## తిరుమలలో 30న ఉగాది ఆస్థానం

### - వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు: తితిదే

తిరుమల (చైతన్య రథం): కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, ఉగాది ఆస్థానం నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వెల్లడించింది. నూతన తెలుగు సంవత్సరాది (ఉగాది)ని పురస్కరించుకొని తిరుమలలో మార్చి 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 25న (మంగళవారం) అష్టాదళ పాదపద్మారాధన సేవను రద్దు చేసినట్టు తితిదే తెలిపింది. మార్చి 30న (ఆదివారం) శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని నిర్వహించనున్నారు.. ఆరోజు సహస్ర దీపాలంకార సేవ మినహా మిగతా ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేసినట్టు తితిదే పేర్కొంది. మార్చి 25, 30న ప్రొటోకాల్ పరిధిలోని వీఐపీలను మాత్రమే బ్రేక్ దర్శనాలకు అనుమతిస్తామని తెలిపింది. ఈ కారణంగా మార్చి 24, 29న వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలు అనుమతించబోమని వెల్లడించింది. ఈ అంశాలని భక్తులు దృష్టిలో ఉంచుకొని తితిదేకి సహకరించాలని కోరింది.

**శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల జూన్ కోటా విడుదల**

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన,



అష్టాదళ పాదపద్మారాధన సేవల జూన్ నెల కోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల లక్కీ డిప్ రిజిస్ట్రేషన్ కోసం మార్చి 18నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్ ద్వారా ఈ టికెట్లు పొందిన భక్తులు మార్చి 20నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే వారికి టికెట్లు మంజూరవుతాయి.

**మార్చి 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల..**

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల జూన్‌నెల కోటాను ఈనెల 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

**మార్చి 21న జ్యేష్టాభిషేకం టికెట్లు...**

జూన్ 9నుంచి 11 వరకు జరుగనున్న శ్రీవారి జ్యేష్టాభిషేకం ఉత్సవంలో పాల్గొనేందుకు టికెట్లను మార్చి 21న ఉదయం 11 గంటలకు భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు.

**మార్చి 21న వర్చువల్ సేవల కోటా విడుదల..**

వర్చువల్ సేవలు,వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన జూన్ నెల కోటాను మార్చి 21న మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**మార్చి 22న అంగప్రదక్షిణం టోకెన్లు..**

జూన్ నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను మార్చి 22న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా..**

శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన జూన్‌నెల ఆన్‌లైన్ కోటాను మార్చి 22వ తేదీ ఉదయం 11గంటలకు విడుదల చేయనున్నారు.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా..**

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా జూన్‌నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మార్చి 22న మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**మార్చి24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల**

జూన్ నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను మార్చి 24న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

**తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల..**

తిరుమల, తిరుపతిలలో జూన్‌నెల గదుల కోటాను మార్చి 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

# వీఆర్ వేరు.. సస్పెన్షన్ వేరు



**- మండలిలో హోంమంత్రి అనిత వివరణ**

**- వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం ప్రశ్నకు బదులు**

అమరావతి, (చైతన్యరథం): టీడీపీ సానుభూతిపరులని భావించి గతంలో పోలీసులను వీఆర్‌లో ఉంచారని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. తమ కూటమి ప్రభుత్వ సంస్కృతి, విధానం అది కాదన్నారు. 2014-19 సమయంలో వీఆర్‌లో ఉన్నప్పటికీ 50 శాతం జీతాలు ఇచ్చారన్నారు. వీఆర్ సాకుతో గత వైసీపీ ప్రభుత్వం పైసా ఇవ్వలేదని విమర్శించారు. జగన్ పాలనలో కొందరు పోలీసులను నాలుగేళ్లపాటు వీఆర్‌లో ఉంచారన్నారు. ప్రస్తుతం 199 మంది పోలీసులు వీఆర్‌లో ఉన్నారని వెల్లడించారు. తమ ప్రభుత్వంలో ఆరోపణలు, వివాదాస్పద నిర్ణయాలప్పుడే వీఆర్‌లో ఉన్నారన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. వీఆర్ అంటే కూటమి ప్రభుత్వంలో వెయిటింగ్ పీరియడ్ మాత్రమేనని స్పష్టం చేశారు. విచారణ పూర్తై అనుమతిరాగానే పెండింగ్ బిల్లులు, శాలరీలు ఒకేసారి చెల్లిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఏళ్ల తరబడి జీతాలివ్వకపోతే ఏం చేశారని ఎమ్మెల్సీ ఏసురత్నాన్ని ప్రశ్నించారు.

ఇప్పుడు పోలీసులు గుర్తొచ్చారా? అని నిలదీశారు. వైఎస్ఆర్సీపీ ఎంఎల్సీగా ఉండి కూడా నాడెందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. వీఆర్‌లో శాంక్షన్డ్ పోస్టులు 26 ఉన్నాయని వారికి జీతాలు ఆగవని వెల్లడించారు. డిప్యుటేషన్ వేకెన్సీ కింద ఏసీబీ, విజిలెన్స్‌లో సేవలు వినియోగించుకుంటామన్నారు. పోలీసు అయ్యుండి సాటి పోలీసుల గురించి నాడెందుకు ప్రశ్నించలేకపోయారని ఎదురుదాడికి దిగారు. సరెండర్ లీవ్, జీతాలు ఇవ్వలేదు, ఒకటో తేదీన ఇవ్వలేదు, భద్రత కల్పించలేదని, అప్పుడేం చేశారని నిలదీశారు. తమ ప్రభుత్వంలో మానవతా దృక్పథంతో పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. వీఆర్‌లో ఉన్నవారికి పూర్తి జీతాలివ్వాలన్న ఛైర్మన్ సూచనలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



## మళ్లీ ఆర్డీవో పరిధిలోకి భూవివాదాలు

**సవరణ బిల్లుకు మండలి ఆమోదం - సత్వర పరిష్కారం కోసమే నిర్ణయం: మంత్రి అనగాని**



అమరావతి, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ భూమి, పట్టాదార్ పాస్ బుక్స్ చట్టం, 1971 సవరణ బిల్లుకు శాసనమండలిలోనూ ఆమోదం లభించింది. ఇక భూ వివాదాలకు సంబంధించి అప్పిలేట్ అథారిటీగా డీఆర్వో స్థానంలో ఆర్డీవో వ్యవహరిస్తారు. ఈ బిల్లు గత గురువారమే శాసనసభలో ఆమోదం పొందింది. సోమవారం శాసనమండలి ఆమోదం కోసం బిల్లును రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. గతంలోనూ అప్పిలేట్ అథారిటీగా ఆర్డీవోనే ఉండగా 2022లో చట్ట సవరణ చేసి డీఆర్వోను నియమించారు. అయితే డీఆర్వోలకు పనిభారం అధికంగా ఉండడంతో అప్పీళ్ల పరిష్కారం ఆలస్యమవుతోంది. ఇప్పటి వరకు పెండింగ్ లో 4 వేలకు పైగా దరఖాస్తులున్నాయని గుర్తించారు. అప్పీళ్ల పరిష్కారానికి డీఆర్వోలకు ఆరు నెలల సమయం పడుతోంది. అదే ఆర్డీవోల స్థాయిలో నెలల కాలంలోనే పరిష్కారమవుతాయని తేలింది. భౌగోళికంగా కూడా ఆర్డీవోలు ప్రజలకు దగ్గరగా ఉంటారు. డీఆర్వోల కన్నా ఆర్డీవోల వద్దకు వచ్చే దరఖాస్తులు తక్కువ సంఖ్యలో ఉంటాయని మంత్రి అనగాని వివరించారు.

## సదవకాశాన్ని వదులుకున్న వలంటీర్లు

**- మంత్రి డోలా వెల్లడి**



అమరావతి, (చైతన్యరథం): వలంటీర్లను 2023 ఆగస్టు వరకే కొనసాగిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని ఆగస్టు తర్వాత వాలంటీర్ల పొడిగింపునకు గత ప్రభుత్వం జీవో ఇవ్వలేదని మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయస్వామి వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చే నాటికి వాలంటీర్లు విధుల్లో ఉండి ఉంటే వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించేవాళ్లం అని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కాలరాసిన వైసీపీ వారే ఇప్పుడు వలంటీర్లపై వైసీపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. వలంటీర్లపై జగన్ కి అంత ప్రేమ ఉంటే వారి ఉద్యోగాలను ఎందుకు రెన్యువల్ చేయలేదని ప్రశ్నించారు. పాము తన గుడ్లు తానే తిన్న చందంగా వాలంటీర్లను జగనే మోసం చేశారని విరుచుకుపడ్డారు.

# ప్రజా ప్రతినిధుల క్రీడలకు సర్వం సిద్ధం

**శాప్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు - వివిధ క్రీడా మైదానాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు - నేడు అట్టహాసంగా ప్రారంభం**








విజయవాడ, (చైతన్యరథం): ప్రజాసేవలో ప్రతినిత్యం తలమునకలయ్యే ప్రజాప్రతినిధులకు ఉపశమనం కలిగించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు శాప్ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసినట్లు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు.

క్రీడలకు సంబంధించి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను, పలు క్రీడా మైదానాలను ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బొజ్జల సుధీర్ రెడ్డి, సుందరపు విజయ్‌కుమార్, పీవీజీఆర్ నాయుడు(గణబాబు), ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పంచుమర్తి అనురాధ కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, తదితర కోర్టులను పరిశీలించి ట్రయల్ గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, క్రీడా శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. దానిలో భాగంగానే కమిటీ సభ్యులంతా గత పదిరోజులుగా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాల్లో 13 క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం మధ్యాహ్నం క్రీడాశాఖామంత్రి, స్పీకర్ కలిసి క్రీడలను ప్రారంభిస్తారన్నారు. 20వ తేదీన క్రీడలు ముసిగిన తర్వాత గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ ప్రజాప్రతినిధులను సైతం క్రీడల్లో భాగస్వాములను చేస్తోందన్నారు. తద్వారా వారి నియోజకవర్గాల్లోనూ క్రీడలను అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా శాసనసభ్యుల క్రీడలతో ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధికి నోచుకోవడం సంతోషకరమైన విషయమన్నారు.

### క్రీడల నిర్వహణపై సమీక్ష..

మూడు రోజుల పాటు జరిగే ప్రజాప్రతినిధుల క్రీడలను ఆయా స్టేడియాల్లో ప్రాధాన్యతాక్రమంలో నిర్వహించనున్నట్లు క్రీడల కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివరించారు. క్రీడల నిర్వహణకు సంబంధించి శాప్ కోచ్‌లు, డీఎస్డీఓలతో సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఒక్కో డీఎస్డీఓకు ఒక్కో క్రీడను కేటాయించారు. వారికి కేటాయించిన క్రీడలకు సంబంధించి జట్లను, మ్యాచ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

తొలుత టగ్ ఆఫ్ వార్, క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, టెన్నిస్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, రన్నింగ్, టెన్నికాయిట్ క్రీడలను నిర్వహిస్తామని వెల్లడించారు. క్రీడల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వసతులు సమకూర్చాలని విశాఖ ఈస్ట్ ఎమ్మెల్యే గణబాబు సూచించారు. అలాగే స్టేడియానికి వచ్చే ప్రజాప్రతినిధులు, న్యాయనిర్ణేతలు, శాప్, మున్సిపల్ అధికారులు ఇబ్బందిపడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు ప్రతీచోట సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ అనురాధ తెలియజేశారు. క్రీడాసామగ్రి పంపిణీ, రిసెప్షన్, శానిటేషన్ విభాగాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గణబాబు, సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌లు సూచించారు. ప్రతీ విభాగానికి ఒక్కో ఇంఛార్జ్ ఉండాలని, దానికారణంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ ఏఓ ఆర్ వెంకటరమణ నాయక్, డీఎస్డీఓలు, శాప్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# పోసాని మహా మోసగాడు

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో పోసాని కృష్ణమురళిపై ఫిర్యాదు

- ఉద్యోగం ఇప్పిస్తానని రూ.9 లక్షలు తీసుకొని మోసం
- గచ్చిబౌలిలో కేసు పెట్టినా పట్టించుకోలేదని మొర
- తనను ఆదుకోవాలని అభ్యర్థించిన సత్యనారాయణ
- ఫిర్యాదులు స్వీకరించిన టీడీపీ నేతలు వీరంకి గురుమూర్తి, మన్నవ మోహన్ కృష్ణ







అమరావతి, (చైతన్యరథం): తనకు ఉద్యోగం ఇప్పిస్తానని గతంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న సినీ నటుడు పోసాని కృష్ణమురళీ మహేష్ అనే వ్యక్తులు తన వద్ద నుండి రూ. 9 లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలు జిల్లా కల్లూరు మండలం కల్లూరుకు చెందిన కె. సత్యనారాయణ శెట్టి సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు ఫిర్యాదు చేశారు. దీనిపై గచ్చిబౌలిలో కేసు పెట్టినా తనకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. డబ్బులు మోసపోవడంతో ఐదేళ్లనుండి ఇంటికి కూడా పోలేక. గుంటూరులో కూలి పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నానని.. తనకు ఇప్పుడు చావే శరణ్యమని.. దయ చేసి తనకు రావాల్సిన డబ్బులను పోసాని నుండి ఇప్పించి న్యాయం చేయాలని నేతలు గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహన్ కృష్ణలకు ఇచ్చిన ఆర్జీలో వాపోయాడు.

### ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి అన్యాయం

2009 సంవత్సరంలో తుంగభద్రకు వరద వచ్చి తమ ఊరు మునిగిపోగా.. అప్పుడు ప్రభుత్వం తమకు ఇల్లు మంజూరు చేసిందని, తమకు మంజూరైన ఇంటిని వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తన అనుచరుడికి ఇచ్చి తమకు అన్యాయం చేశాడని కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన ముల్లా ఖాతూన్ బీ వాపోయింది. తమ ఇల్లు తమకు ఇప్పించాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి వేడుకుంది. తమ గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తాగునీటి కుళాయిలు, స్మశానవాటికతో పాటు సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ బిల్డింగ్‌ను నిర్మించాలని పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం లక్కగూడెంకు చెందిన మాజీ సర్పంచ్ కె. కళావతి, మాజీ ఎంపీటీసీ తదితరులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. కబ్జా దారులు తమ భూమికి ఉన్న సరిహద్దు రాళ్లు పీకి భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని.. దయ చేసి తమ భూమిని సర్వే చేసి రాళ్లు పాతించాలని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలానికి చెందిన ఎమ్. సత్యం నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించాడు.

బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన నారిశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేస్తూ తాను కొనుగోలు చేసిన భూమిని దొంగ రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా.. తనపై దౌర్జన్యం చేసి చంపుతామని బెదిరిస్తున్నారని.. ఆక్రమణ దారులకు అధికారులు వత్తాసు పలుకుతూ తప్పుడు రిపోర్ట్‌లు ఇస్తున్నారని.. తమ వద్ద ఉన్న ఆధారాలు పరిశీలించి తమ భూమిని కబ్జా నుండి విడిపించాలని గ్రీవెన్స్‌లో నేతలను వేడుకున్నాడు.

### సాగునీటి సమస్యను పరిష్కరించండి

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొత్తపల్లె, గోకవరం మజరా, యం. లింగాపురం గ్రామాలకు చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తూ.. రైతులకు సాగునీటికోసం చెరువును నిర్మించి నీటి పారుదల కోసం కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో నీరంతా తూము ద్వారా వాగుకు వృథాగా పోతుందని.. దయ చేసి కాలువలు ఏర్పాటు చేసి సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కడప జిల్లా కడపకు చెందిన ఎస్. బాషా విజ్ఞప్తి చేస్తూ.. కడప పట్టణంలో ప్రైవేట్ స్థలాల్లో ఎగ్జిబిషన్‌లు పెట్టకూడదని గత ప్రభుత్వంలో తీర్మానం చేయడంతో దాదాపు 300 కుటుంబాలకు పైగా ఉపాధి కోల్పోయారని.. ఎగ్జిబిషన్‌లు పెట్టుకోవడానికి పర్మిషన్‌లు ఇప్పించి ఆదుకోవాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి అభ్యర్థించాడు.

## శాప్ ఛైర్మన్, మాజీ క్రికెటర్ ఎమ్ఎస్‌కే భేటీ

### - క్రీడాభివృద్ధిపై చర్చ



విజయవాడ, (చైతన్యరథం): ఏపీలో క్రీడలను అభివృద్ధి చేయడంతోపాటు క్రీడాకారులు మరింత మెరుగ్గా రాణించేందుకు కృషి చేస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాజీ క్రికెటర్, బీసీసీఐ చీఫ్ సెలక్టర్ ఎమ్ఎస్‌కే ప్రసాద్‌కు వివరించారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని శాప్ ఛైర్మన్ ఛాంబర్లో వారిరువురూ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఏపీలో క్రీడల అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ఏపీలో అత్యుత్తమ క్రీడాసౌకర్యాలు, వసతులు కల్పించడమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అలాగే క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పీపీపీ విధానం, క్రీడాకారులను దత్తత తీసుకునే విధంగా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ఔత్సాహికులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. ముఖ్యంగా అంతర్జాతీయస్థాయిలో రాణిస్తూ ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందిన క్రీడాకారులు ఏపీలోనూ అకాడమీలు స్థాపించి క్రీడాకారుల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఎమ్ఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రూపొందించిన స్పోర్ట్స్ పాలసీ అద్భుతంగా ఉందన్నారు. క్రీడారంగం ఉన్నతిపై ఆయనకున్న దూరదృష్టి, శ్రద్ధ అభినందనీయమన్నారు. ఏపీ క్రీడాభివృద్ధికి తమవైపు నుంచి కూడా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# ఏజెన్సీలో ఐదు మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రులు

- వైసీపీ హయాంలో అసంపూర్తిగా పీహెచ్‌సీ నిర్మాణాలు
- ఆర్భాటంగా నాడు-నేడు.. ప్రయోజనం శూన్యం
- కాంట్రాక్టర్లకు బిల్లులు ఎగవేత నిలిచిపోయిన కట్టడాలు
- అసెంబ్లీలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, (చైతన్యరథం): గత ప్రభుత్వం కొత్త పీహెచ్‌సీలను నిర్మిస్తామంటూ ఆర్భాటంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం అసంపూర్తిగానే మిగిలిపోయిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కొత్త పీహెచ్‌సీల నిర్మాణంపై శాసనసభలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సక్రమంగా బిల్లులు చెల్లించనందువల్లే పనులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. ప్రత్యేకించి విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యుడు పంచకర్ల రమేష్ బాబు సబ్బవరం పీహెచ్‌సీకి సంబంధించి అడిగిన ప్రశ్నపై మంత్రి స్పందిస్తూ ఈ వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో రు.1.04 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారని, అయితే కాంట్రాక్టర్ మాత్రం రు.24 లక్షల మేర పనులు మాత్రమే చేసి, నాటి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో పనులు నిలిపివేశారన్నారు. తరువాత ఐదు సార్లు టెండర్లు పిలిచినప్పటికీ చేసిన పనులకు బిల్లులు రావన్న భయంతో కాంట్రాక్టర్లెవరూ ముందుకు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ కొత్త పీహెచ్‌సీ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిదని, త్వరలోనే అందుకు సంబంధించిన టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. సభ్యులడిగిన సీహెచ్‌సీ అప్ గ్రేడేషన్ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామన్నారు. ప్రతి పీహెచ్‌సీకి రూ.1.43 లక్షల వంతున కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వం రు.670 కోట్ల అంచనా వ్యయంతో 1972 పిహెచ్సిల నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ బిల్లుల చెల్లింపు సమస్యతో కాంట్రాక్టర్లు కేవలం రు.426 కోట్ల మేర పనులు మాత్రమే పూర్తి చేశారని, అందులో కూడా కేవలం రు.250 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయన్నారు. మిగిలిన బిల్లుల బకాయిలను గత ప్రభుత్వం కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా అప్పగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పిహెచ్సిల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రు.276 కోట్లు విడుదల చేసిందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాత పీహెచ్‌సీల పునరుద్ధరణ కార్యక్రమాన్ని గత ప్రభుత్వం చేపట్టినప్పటికీ అది కూడా అసంపూర్తిగానే నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమాన్ని తిరిగి చేపట్టడానికి వీలుగా నిధుల లభ్యతపై తమ ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అసంపూర్తిగా వున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి కూడా తమ ప్రభుత్వం నిధులను మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు -నేడు కింద జరిగిన పనులన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయాయని, జరిగిన పనుల్లో కూడా నాణ్యత లేదని తమ పరిశీలనలో తేలిందని మంత్రి వివరించారు.

### దేశమంతా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల నిర్మాణం

దేశ వ్యాప్తంగా లక్షా 50 వేల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం తలపెట్టగా ఏపీలో అప్పటికే ఉన్న సబ్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తూ కొత్తగా 10,032 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను నిర్మించాలనుకున్నారని, ఇందులో ఎన్ఆర్ఈజీయస్ నిధుల కింద 3,105 పూర్తి చేశారని, మిగిలినవి అలాగే ఉన్నాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద 1760, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద 1500 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఈ బడ్జెట్లో కొత్తగా చేపట్టనున్నామని, తొందర్లోనే టెండర్లు పిలిచి పూర్తి చేస్తామని మంత్రి సభకు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల్ని సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, బుట్టాయిగూడెం, డోర్నాలలో నిర్మించడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవల్ని అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వీటి నిర్మాణానికి సంబంధించి టెండర్లు కూడా పిలిచామని, పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

# భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి
## అనుసంధానంగా15 రహదారుల నిర్మాణం




భోగాపురం (చైతన్యరథం): ఉత్తరాంధ్రలో కీలకమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే ఏడాదిలో అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో విశాఖ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి పెరగకుండా దీనికి అనుసంధానం చేస్తూ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 15 అత్యంత ప్రాధాన్యత కలిగిన రహదారుల నిర్మాణానికి ప్రతిపాదించామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథ్ తెలిపారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పదిహేను రహదారుల్లో ఇప్పటికే మారికవలస రహదారి నిర్మాణం పూర్తైందని, మిగిలినవి జూన్-2026 వాటికి పూర్తి చేస్తామన్నారు. గతంలో రూపొందించిన వీఎంఆర్డీఏ బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) - 2042పై అనేక ఫిర్యాదులు, అభ్యంతరాలు వస్తున్నాయని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్లాన్‌లోని తప్పులను సవరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరిలోగా టెండర్లు ఖరారు చేసి, ప్రజాప్రతినిధులు, ప్రజల మంచి వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలించి, పూర్తి పారదర్శకంగా మాస్టర్ ప్లాన్ ని సవరిస్తాం. అదేవిధంగా ఇటీవల గ్రామీణ ప్రాంతంలోని 14 మండలాలు వీఎంఆర్డీఏ పరిధిలోకి విలీనమయ్యాయి, వీటిని కూడా మాస్టర్ ప్లాన్ పరిధిలోకి తీసుకువస్తామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ తెలిపారు.

# టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



అనకాపల్లి (చైతన్యరథం): నిత్య జీవితంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఎవ్వరూ ఊహించలేరు. మరీ ముఖ్యంగా రోడ్డు మీద ప్రయాణం చేసేటప్పుడు ఎటువైపు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మనం బాగానే వాహనం నడుపుతున్నా ఇతరులు ఏ విధంగా వాహనాన్ని డ్రైవ్ చేస్తున్నారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకొని ప్రయాణం చేస్తున్నా కొన్నిసార్లు ఇతరులు చేసినా తప్పులకూ ఎందరో అమాయకులు బలవుతున్నారు. తాజాగా అనకాపల్లి జిల్లా మునగపాకలో క్వారీ టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి బలయ్యాడు. స్కూటీపై వెళ్తున్న కన్నారావును టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. వెంటనే అతను కిందపడిపోయాడు. ఈ క్రమంలో టిప్పర్ చక్రాలు అతనిపై నుంచి వెళ్లాయి. దీంతో కన్నారావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు ఈ ప్రాంతంలో క్వారీ టిప్పర్లు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిమితికి మించిన లోడుతో వెళ్లడమేగాక, నిర్లక్ష్యంగా నడుపుతున్నారని వాపోయారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# చేనేత కార్మిక కుటుంబాల్లో 'విద్యుత్' వెలుగులు

- ●చంద్రబాబు నేతృత్వంలో క్యాబినెట్ ఆమోదం హర్షణీయం
- ●రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య



అమరావతి (చైతన్యరథం): చేనేత కార్మికుల ఇళ్లకు రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్తును ఆమోదిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం ఆమోదించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమం, అభివృద్ధి సంస్థ చైర్మన్ నందం అబద్ధయ్య పేర్కొన్నారు. ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో చేనేతరంగానికి ఊతమిచ్చేలా నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. అలాగే, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడంపైనా అబద్ధయ్య హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మిక కుటుంబాలకు చేదోడుగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ద్వారా ఆ వర్గాల పట్ల అభిమానాన్ని తెలియజేస్తోందన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర విద్య,ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేనేత కార్మికుల సంక్షేమం, అభ్యున్నతికోసం ప్రత్యేక చొరవచూపుతుండడం గొప్ప విషయమని అబద్ధయ్య పేర్కొన్నారు. లోకేష్ ప్రతిపక్షంలో వున్న సమయంలోనూ ప్రత్యేకించి మంగళగిరిలోని చేనేత కార్మిక కుటుంబాలకు పెద్దఎత్తున ఆధునిక రాట్నాలు ఉచితంగా అందజేశారని అబద్ధయ్య తెలిపారు. అలాగే, మంగళగిరి ఆటోనగర్లో వీవర్ శాల ఏర్పాటుచేయడమేకాకుండా చేనేతకార్మికులకు చేనేతలో నైపుణ్య శిక్షణ ఇప్పించడంతోపాటు మెరుగైన ఉపాధిని అందించారని ఈ సందర్భంగా అబద్ధయ్య తెలియజేశారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా వున్న చేనేత కార్మిక కుటుంబాలకు మేలు జరిగేలా ఈ రోజు మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలపడంలో కూడా లోకేష్ ప్రత్యేక చొరవలేకపోలేదని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాల ప్రజానీకానికి పెద్దపీట వేస్తోందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా చూస్తోందని, నేడు చేనేత కార్మిక కుటుంబాలకు అండగా నిలవడం పట్ల అబద్ధయ్య సంతోషం వ్యక్తంచేస్తూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవితలకు ధన్యవాదాలు తెలిపారు. ముమ్ముందుకూడా కూటమి ప్రభుత్వం చేనేతల పట్ల ఇదే ఆదరాభిమానాలు కనబరుస్తుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య ఆశాభావం వ్యక్తంచేశారు.

# తిరుమల శ్రీనివారిని దర్శించిన స్పీకర్ అయ్యన్న




నర్సీపట్నం (చైతన్యరథం): తిరుమల శ్రీనివాసుని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన సతీమణి పద్మావతి, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న అనంతరం, తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తుల మధ్య అన్నప్రసాదాలు స్వీకరించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరుని కృపా కటాక్షాలు సర్వ జనులకు లభించాలని స్పీకర్ అయ్యన్న ఆకాంక్షించారు. దేవస్థానం వృద్ధి, భక్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అయ్యన్న దంపతులను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు రంగనాయక మండపంలో వేద పండితులు వేదాశీర్వచనము చేశారు.

# తాచుపాము కరిచినా 10వ తరగతి పరీక్ష
## రాసిన విద్యార్థి వై.నిస్సి



అనపర్తి (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో పాము కాటుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన వెంటనే.. కాస్త కోలుకున్నాక 10వ తరగతి పరీక్ష రాశాడు వై. నిస్సి అనే విద్యార్థి. అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు నిస్సీ. ఓ వైపు జీవితంలో ఎంతో ముఖ్యమైన టెన్త్ ఎగ్జామ్.. మరోవైపు ప్రాణాలనే కబళించే తాచుపాము కాటు. అయితే ప్రాణాలను రిస్కులో పెట్టి మరీ ఆ విద్యార్థి పదవ తరగతి పరీక్ష రాశాడు. వివరాల్లోకి వెళ్తే.. అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వై నిస్సి అనే విద్యార్థి పదవ తరగతి చదువుతున్నాడు. పబ్లిక్ పరీక్షలు సమీపించడంతో శనివారం సాయంత్రం ఓ చెట్టు కింద కూర్చొని చదువుకుంటూ ఉండగా.. పక్కనే ఉన్న ఓ రాయిపై వేలు పెట్టడంతో తాచుపాము కాటు వేసింది. దీంతో ఉపాధ్యాయులు హుటాహుటిన అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అయితే సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అవడంతో ఆసుపత్రి నుంచే ఉదయం నేరుగా లక్ష్మీ నరసాపురంలోని పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్ష విజయవంతంగా పరీక్ష రాశాడు ఆ విద్యార్థి. అనంతరం మళ్లీ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లాడు. సాధారణంగా పాములు.. పొలాలు, అడవులు, ఏజెన్సీ ప్రాంతాల్లో నీటి వనరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే సంచరిస్తూ ఉంటాయి. ఐతే అడవులు క్రమంగా తగ్గిపోవడం వల్ల పాములు జనావాసాల్లోకి వస్తున్నాయి. దీనికి తోడు పారిశ్రామికీకరణ వల్ల నీటి కాలుష్యం పెరగడంతో అవి బయట తిరుగుతున్నాయి. అందునా ఇప్పుడు వేసవి సమీపించడంతో.. వేడి తాపానికి నీటి కోసం అవి జనాలు ఉండే ప్రాంతాలకు వస్తూ ఉంటాయి. పాముల బెడద తగ్గాలంటే అడవులను విచ్చలవిడిగా నరకడాన్ని ఆపేయాలి. నీటి కాలుష్యాన్ని తగ్గించాలి. పాము కరచినపుడు నాటు వైద్యం, మంత్రవైద్యం కాకుండా తప్పనిసరిగా ఆసుపత్రుల్లోనే చికిత్స తీసుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం ఉండరాదు. భయపడకుండా ధైర్యంగా ఉంటే.. సగం బ్రతికినట్లే.

# మన్యంలో ఠారెత్తిస్తున్న ఎండలు



మన్యం (చైతన్యరథం): మన్యంలో ఎండలు తీవ్ర ప్రభావం చూపుతుండడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో పొగమంచు, చలి ప్రభావం క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. పాడేరులో 40.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, జీకేవీధిలో 34.0, జి.మాడుగుల, హుకుంపేటలో 34,7, చింతపల్లిలో 35.1, అరకులోయలో 35.2, పెదబయలులో 34.9, డుంబ్రిగుడలో 37.3, ముంచంగిపుట్టులో 36.4, అనంతగిరిలో 33.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి ప్రారంభంలోనే ఎండలు తీవ్ర ప్రభావం చూపడంతో రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం ఆందోళన చెందుతున్నారు.

## రాష్ట్రపతి అల్పాహారం విందుకు హాజరైన ఏలూరు ఎంపీ



ఏలూరు (చైతన్యరథం): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు సహచర పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన పరిచయ కార్యక్రమంలో ఎంపీ మహేష్ కుమార్ చేతులు జోడించి రాష్ట్రపతి ముర్ముకు నమస్కరించారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము ఇచ్చిన అల్పాహారం విందులో ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. చివరిగా రాష్ట్రపతి ముర్ముతో సహచర ఎంపీలతో కలిసి మహేష్ కుమార్ గ్రూప్ ఫోటో దిగారు.

## వేపాకు కషాయంతో చీడపీడల నివారణ



ఘంటసాల (చైతన్యరథం): వేపాకుల కషాయంతో చీడపీడలను నివారించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ పని అనుభవం కార్యక్రమంలో భాగంగా సోమవారం తాడేపల్లిలో పలువురు రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ ద్వారా విషపు ఎరను తయారీ విధానాన్ని, పాటించాల్సిన మెళుకువలను గూర్చి విద్యార్థినులు వివరించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి. సుధారాణి, శాస్త్రవేత్త కె. రేవతి పర్యవేక్షణలో రైతులకు వ్యవసాయంలో తెగుళ్ళ నివారణపై విద్యార్థినిలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, మైనేని మధుసూదన రావు, అరవపల్లి శేష బాపయ్య, ముప్ప ప్రసాదరావు, అప్పికట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## గోపాలపురంలో కొనసాగుతున్న డయేరియా కేసులు



గోపాలపురం (చైతన్యరథం): మండలంలో డయేరియా విజృంభించింది. గడిచిన మూడు రోజుల్లో 10 గ్రామాల నుంచి సుమారు 30 మంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు. ప్రతి రోజూ ఎంతో కొంత మంది చేరుతూనే ఉన్నారు. ఇప్పటి వరకూ మండల కేంద్రం గోపాలపురంలో 15 మంది, వేళ్లచింతలగూడెంలో ముగ్గురు, పెద్దాపురంలో ఇద్దరు, వెంకటాయపాలెంలో ముగ్గురు, చిట్యాలలో ఇద్దరు, గుడ్డిగూడెంలో ఇద్దరు, కొవ్వూ రుపాడులో ఒక్కరు, తిరుగుడుమెట్టలో ఇద్దరు డయేరియా బారినపడ్డారు. ఆయా గ్రామాల్లో పొగాకు అధిక సంఖ్యలో సాగవుతోంది. ఈ నేప థ్యంలో జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో కార్మికులు వలసలు వస్తారు. సుమారు 3 నెలల పాటు పంట పొలాల్లోనే తాటాకు పాకలు వేసుకుని అక్కడే నివాసం ఉంటారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పంట బోర్ల నుంచి వచ్చిన నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటారు. మరో పక్క వేసవి కావడంతో వాతావరణంలో మార్పులు.. విపరీతమైన ఎండలు వైద్య సిబ్బంది పరిగణనలోకి తీసుకుంటున్నారు. పొగాకు తోటల్లో పిచికారీ చేసిన పురుగు మందుల అవ శేషాల ఘాటత పీల్చడం కూడా దీనికి ప్రధాన కారణం అని వైద్య సిబ్బంది చెపుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో నమోదైన కేసులలో 19 మంది సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోగా మరో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. ప్రస్తు తం వారి ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నారు.

ఆసుపత్రి వర్గాల నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందడంతో జిల్లా వైద్యాధికారులు గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయేరియాతో చికిత్స పొందుతున్న వారి వద్దకు హుటాహుటిన వచ్చి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా చికిత్స అందించినా ఆదివారం వెలుగులోకి వచ్చింది.దీంతో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు అన్నదేవరపేట, హుకుంపేట ఆరోగ్య కేంద్రాల వైద్యులను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో బాధితులు పరిసరాల వద్ద బ్లీచింగ్ పిచికారీ చేసి నీటి నమూనాలను పరీక్షలకు పంపిస్తా మని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. డయేరియా బాధితులను ఆదివారం రాత్రి ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ పరామర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితులకు సమ ప్రాధాన్యం

- ఫేజ్-1లో నిర్వాసితులకు 2026 జూన్‌కు ఇళ్ళు పూర్తి చేస్తాం
- ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి ఫేజ్-2 నిర్వాసితులకు కూడా ఇళ్ళు నిర్మిస్తాం
- శాసనమండలిలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు గత అయిదేళ్లలో ఒక్క రూపాయి నష్టపరిహారం గానీ, కాలనీల నిర్మాణానికి అరబస్తా సిమెంట్ పనులు కూడా చేయలేదని మంత్రి నిమ్మల రామానాయుడు దుయ్యబట్టారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. గత ఐదేళ్ల గోదావరికి వరదలు వచ్చినప్పుడు కనీసం తాగడానికి మంచి నీళ్ల ప్యాకెట్లు కూడా ఇవ్వలేదని, ఒక్క నాయకుడు కూడా వచ్చి పరామర్శించలేదని,ఇలా నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో మమ్మల్ని తెలంగాణలో కలిపేయమని రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు అని అన్నారు.

### ఐదేళ్ల పాలనలో ఒక్క ఇంటిని కూడా వైసీపీ నిర్మించలేదు

నాడు 2019 ఎన్నికల ముందు నిర్వాసితులకు అడుగడుగునా వాగ్దానాలు చేసిన జగన్మోహన్ రెడ్డి, 2019-24లో అధికారంలో ఉండి కూడా నిర్వాసితుల కాలనీల్లో ఒక్క అరబస్తా సిమెంట్ పని కూడా చేయలేదు,ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు అని దుయ్యబట్టారు. 2019లో చంద్రబాబు నాయుడు హయాంలో పూర్తైన కాలనీలు తప్ప, ఒక్క కాలనీలో, ఒక్క ఇల్లు కూడా జగన్మోహన్ రెడ్డి పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు.

### రూ.1340.47 కోట్లు చెల్లించాలి

పోలవరం ప్రాజెక్టుకు అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో 5 మండలాలు, ఏలూరు జిల్లాలోని 8 మండలాల్లోని 222 రెవెన్యూ గ్రామాలకు చెందిన 373 శివారు గ్రామాల్లో 96,660 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయని గుర్తించడం జరిగింది. ఇందులో 41.15 మీటర్ల కాంటూరు పరిధిలో 8మండలాల్లోని 9 రెవిన్యూ గ్రామాలు, 172 శివారు గ్రామాల్లో 38,060 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయని, ఇంక 41.15 మీటర్ల నుండి 45.72 మీటర్ల కాంటూరు వరకు 6మండలాల్లోని 132 రెవిన్యూ గ్రామాలకు చెందిన 201 శివారు గ్రామాల్లోని మొత్తం 58,600 నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో 41.15 మీటర్ల కాంటూరులో భాగంగా 38,060 నిర్వాసిత కుటుంబాల్లో ఇప్పటి వరకు 19794 కుటుంబాలకు 1203 కోట్ల రూపాయల పరిహారాన్ని అందించడం జరిగింది.ఇంకా 18,266 నిర్వాసిత కుటుంబాలకు 1340.47 కోట్ల రూపాయాలన చెల్లించాల్సి ఉంది. ఇందులో 9212 నిర్వాసిత గిరిజన కుటుంబాలకు 575.11 కోట్లను, 10,582 గిరిజనేతర నిర్వాసిత కుటుంబాలకు 627.89 కోట్ల రూపాయలను చెల్లించడం జరిగింది. ఇంకా 9128 గిరిజన నిర్వాసిత కుటుంబాలకు 573.32 కోట్ల రూపాయలను, 9,138 గిరిజనేతర నిర్వాసితులకు 767.15 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది.

### ఏప్రియల్ నెలాఖరులోపుగా నిర్వాసితులకు ఆర్అండ్ఆర్

ఇలా ఫేజ్-1లో 38,060 నిర్వాసిత కుటుంబాల్లో 12,797 నిర్వాసిత కుటుంబాలను ఇప్పటి వరకు తరలించడం జరిగింది.ఇంకా 25,263 కుటుంబాలను తరలించాల్సి ఉందన్నారు. నిర్వాసితులను తరలించడానికి కావలసిన కాలనీల నిర్మాణ పనులకు సంబంధించి, మొదట్లో సర్వే చేసినప్పుడు 20,946 కుటుంబాలను గుర్తించగా, ఆ తరువాత కొత్తగా మరలా రాడార్ సర్వే చేసినప్పుడు అదనంగా 17,117 కుటుంబాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇందులో 20946 కుటుంబాలకు గానూ, 75 కాలనీలను గుర్తించి నిర్మాణ పనులు మొదలుపెట్టడం జరిగింది.ఇందులో 26 కాలనీలు పూర్తి చేశామన్నారు. ఇంకా 49 కాలనీలు నిర్మాణ దశలో ఉన్నాయని, కొత్తగా రాడార్ సర్వే చేయడం ద్వారా వచ్చిన 17,117 కుటుంబాలు కూడా 49 గ్రామాల్లో వస్తున్నాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, వారికి మూడు ఆప్షన్స్ ఇస్తున్నాం అని, వాటిలో మొదటిది వారే స్వతంగా ఇళ్ళు నిర్మించుకోవడం, రెండోది ప్రభుత్వం నిర్మించే ఇళ్ళను తీసుకోవడం, మూడోది ఇంటికి, స్థలానికి మొత్తానికి వన్ టైం సెటిల్మెంట్ చేసుకునేలా, ఇలా మూడు ఆప్షన్స్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇలా గ్రామసభలు పెట్టి నిర్వాసితుల నుండి అప్లికేషన్స్ తీసుకోవడం జరుగుతుందని, దీనికి కూడా నిర్ణీత గడువు పెట్టుకుని, మార్చి చివరి వరకు గ్రామ సభలు పూర్తి చేయాలని, ఏప్రియల్ నెలాఖరు లోపుగా నిర్వాసితులు కోరుకున్న విధంగా ఆర్అండ్ఆర్ కు సంబంధించిన కాలనీలు గుర్తించాలన్నారు. తరువాత 90 రోజుల్లోనే అనగా ఆగష్టు లోపు భూసేకరణ పూర్తి చేయాలని నిర్ణీత గడువుపెట్టుకుని, నిర్వాసితులకు సంబంధించి 75 కాలనీల్లో మిగిలిన పనులు సైతం పూర్తి చేసేలా, కొత్తగా టెండర్లు పిలిచి, పనులు వేగవంతం చేయాలని నిర్ణయించామని తెలిపారు.

## ఎన్ఆర్ఐ టీడీపీ కార్యకర్తలతో అరవిందబాబు ఆత్మీయ సమావేశం



నరసరావుపేట (చైతన్యరథం): నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అమెరికాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా కాలిఫోర్నియా రాష్ట్రంలోని బేవేరియా ఎన్నారై టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. మిల్పిటాస్‌లో బేవేరియా ఎన్నారై టీడీపీ కార్యకర్తలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎన్నారై టీడీపీ నాయకుడు కోగంటి వెంకట్ ఆధ్వర్యంలో బిర్యానీ జంక్షన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించగా.. చదలవా అరవిందబాబు సతీసమేతంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక ప్రసంగం చేశఆరు. తన అనుభవాలు, విశేషాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి 100మందికి పైగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ముందుగా కోగంటి వెంకట్ అందరికీ స్వాగతం పలికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా శ్రీనివాస్ తాడపనేని, జాస్తి రజనికాంత్.. డాక్టర్ అరవిందబాబుని పుష్పగుచ్ఛాలతో వేదికపైకి సాదరంగా ఆహ్వానించారు. ఆ తరువాత స్థానిక ఎన్నారైలు ముఖ్యంగా పల్నాడు ప్రాంతానికి చెందిన పలువురు ఎన్నారైలు అరవిందబాబు, ఆయన సతీమణి సుధను శాలువాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ.. తన రాజకీయ ప్రస్థానం, గత ఐదు సంవత్సరాల కాలంలో ఎదుర్కొన్న సవాళ్ళు తదితర విషయాలు వివరించారు. ఒక సాధారణ పేద కుటుంబం నుంచి వచ్చి డాక్టర్‌గా సేవలందిస్తున్న తాను మరింత ప్రజాసేవ చెయ్యాలని భావించినప్పుడు తెలుగుదేశం పార్టీ మాత్రమే ఇందుకు సరైన వేదిక అని భావించానన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వం ఎనలేని తోడ్పాటునిచ్చిందని వివరించారు. తొలి ప్రయత్నంలో విజయం సాధించలేకపోయినా యువ నాయకులు నారా లోకేష్ పోరాట స్ఫూర్తితో మరింత పట్టుదలగా పోరాడి మలిప్రయత్నంలో విజయం సాధించానని తెలిపారు. ఈ విజయంలో ఎన్నారైల పాత్ర అత్యంత ప్రముఖమైనదని చెప్పారాయన. ఎన్నారై టీడీపీ సమన్వయకర్త కోమటి జయరాం సహకారం మర్చిపోలేనిది, తన విజయానికి కృషి చేసిన ఎన్నారై తెలుగుదేశం సభ్యులకు సదా రుణపడి ఉంటానని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేకించి పల్నాడు ప్రాంత అభివృద్ధికి ఎన్నారైలు మరింత సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. కోగంటి వెంకట్ ప్రసంగిస్తూ.. అరవిందబాబు పోరాట పటిమ ప్రతి తెలుగుదేశం కార్యకర్తకీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ ఎన్నికలలో కోమటి జయరాం మార్గదర్శకత్వం, క్రమశిక్షణ ఎనలేనివని కొనియాడారు. డాక్టర్ కోడెల శివరాంప్రసాద్ తరువాత నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీకి అరవిందబాబు లాంటి నిబద్ధత కలిగిన నాయకుడు శాసనసభ్యుడిగా ఎన్నిక కావడం, ఈ విజయంలో ఎన్నారై తెలుగుదేశం కూడా భాగస్వామి కావడం ఆనందించదగిన విషయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయ్ సాగర్ రెడ్డి జెట్టి, నరేష్ కొండపల్లి, కోన నరేంద్రనాథ్ రెడ్డి, నవీన్ సమన్వయపరచగా.. శ్రీనివాస్ వల్లురుపల్లి, వెంకట్ కొల్లా, శ్రీనివాస్ వట్టికూటి, భరత్ ముప్పిరాల, శ్రీకాంత్ కోనేరు, రమేష్ మల్లరాపు, జగదీష్ గింజుపల్లి, రాజేష్ కొండపనేని, బ్రహ్మానంద నాయుడు దబ్బర, వెంకటేష్ కొండపల్లి, నవీన్ కొండపల్లి హాజరయ్యారు.

# ఏపీ వ్యాప్తంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

అమరావతి (చైతన్యరథం): ఏపీ వ్యాప్తంగా నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సామాన్యశాస్త్రం పరీక్షలు మినహా మిగతావి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 వరకు ఇవి కొనసాగనున్నాయి. సుమారు 6.50లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈసారి రెగ్యులర్ విద్యార్థులతోపాటే సార్వత్రిక విద్యాపీఠం అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రశ్నపత్రం చదువుకునేందుకు అదనంగా 15 నిమిషాలు కేటాయించారు. క్యాలెండర్ ప్రకారం మార్చి 31న రంజాన్ పర్వదినంలో ఏమైనా మార్పులు చోటుచేసుకుంటే సాంఘిక శాస్త్రం పరీక్షలో మార్పు చేయనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు, తల్లిదండ్రుల రాకతో సందడి వాతావరణం నెలకొంది.



# పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించండి : కేశినేని



ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): "భారతదేశ రైల్వే ఆర్థిక వ్యవస్థకు ఆదాయం సమకూర్చటంలో విజయవాడ కీలక పాత్ర పోషిస్తుంది. విజయవాడ రైల్వే స్టేషన్ ప్రయాణీకులకి సదుపాయాలు కల్పించేందుకు అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపికైంది. అత్యధిక ఆదాయం అందిస్తున్న విజయవాడ రైల్వేస్టేషన్‌కి ఈ పథకం కింద గతమూడేళ్లుగా ఒక రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు." అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో సోమవారం ప్రశ్నించారు. లోక్ సభలో 2025-26 రైల్వే మంత్రిపై డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ కింద ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రసంగిస్తూ విజయవాడలో పెండింగ్‌లో వున్న రైల్వే సమస్యలు కేంద్ర ప్రభుత్వం దృష్టి తీసుకువచ్చారు. అలాగే ఈ రైల్వే బడ్జెట్ దేశ రైల్వే భవిష్యత్తుకు అనుకూలంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ నిబద్ధత ప్రతిబింబిస్తుందన్నారు. విజయవాడలో సమీపంలోని పరిటాలలో మల్టీ-మోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ఏర్పాటు చేయడాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ స్వాగతించారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి రైల్వే లైన్‌ను ఆమోదించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు .ఆంధ్రప్రదేశ్ కు అభివృద్ధికి దోహదపడే రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి వల్లే సాధ్యపడిందన్నారు

**నిధులు మంజూరు చేయాలి**

దేశంలోనే అత్యంత రద్దీగా వుంటే రైల్వే స్టేషన్స్‌లో విజయవాడ స్టేషన్ ఒకటి. ఏటా 16.84 మిలియన్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంది. అమరావతి రాజధానిలో విజయవాడ రైల్వే స్టేషన్ ఒక భాగం. అమరావతి రాజధాని ప్రాంతంలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే డివిజన్లలో ఒకటైన విజయవాడ జంక్షన్ వరుసగా రెండు సంవత్సరాలుగా రూ.5,000 కోట్ల ఆదాయాన్ని అధిగమించిందని, అత్యధిక సరుకు రవాణా ద్వారా రూ.4,000 కోట్లు ఆదాయం రాబట్టింది. అయినా గత మూడేళ్లుగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద స్టేషన్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయని విషయాన్ని ఎంపీ శివనాథ్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

# మంగళగిరి చిరు వ్యాపారులకు తోపుడు బళ్లు, కార్మికుడికి ప్లాట్ ఫామ్ రిక్షా పంపిణీ

**●స్థానిక నాయకులతో తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షా అందజేయించిన మంత్రి నారా లోకేష్**




మంగళగిరి (చైతన్యరథం): నియోజకవర్గంలో పేద, బడుగు బలహీన వర్గాల వారికి రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా సహాయ సహకారాలు చేస్తూ అండగా ఉంటున్నారని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో మంగళగిరి పట్టణంలోని 27వ వార్డుకు చెందిన సనంగుల పెదకొండయ్య, బాలాజీ నగర్ కు చెందిన దండిగిరి వెంకటరత్నకు తోపుడు బళ్లు, 24వ వార్డుకు చెందిన కర్నాటి నాగేశ్వరరావుకు ప్లాట్ ఫామ్ రిక్షా అందజేశారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన షేక్ అల్లా బక్షు, రాయపాటి దామయంతికి తోపుడు బళ్లు పంపిణీ చేశారు. అద్దె బళ్ళు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నామని, తమకు బండ్లు అందజేయాలని చిరువ్యాపారులు, రిక్షా కార్మికుడు మంత్రి నారా లోకేష్ ని కోరగా స్పందించిన ఆయన స్థానిక నాయకుల చేతుల మీదుగా తోపుడు బండ్లు, ప్లాట్ ఫామ్ రిక్షా అందజేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట పార్థసారథి మాట్లాడుతూ... మంత్రి నారా లోకేష్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎందరో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. వివిధ రకాల ఉపాధి కోసం మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ అందించిన తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు, ఇస్త్రీ బండ్లు, కూరగాయల బండ్లు ఆయా కుటుంబాల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 10వ వార్డు అధ్యక్షులు కౌతరపు శ్రీనివాసరావు, 24 వ వార్డు అధ్యక్షులు గంజి చంద్రశేఖర్ రావు, నవులూరు గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్రు కోటేశ్వరరావు, వంగర హనుమాన్, ఊట్ల శ్రీమన్నారాయణ, కొల్లి వెంకట్రావు, కొత్త శ్రీనివాసరావు, ఆకుననూరి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరిస్తాం

గుంటూరు (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వం పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం చేస్తామని చెప్పి వ్యాపారులను మోసం చేసిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపణలు చేశారు. పీవీకే నాయుడు మార్కెట్‌ను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరిశీలించారు. మార్కెట్లో వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను మంత్రి పెమ్మసాని తెలుసుకున్నారు. త్వరలో పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ నిర్మిస్తామని మాటిచ్చారు. కొత్తగా నిర్మించే మార్కెట్ కాంప్లెక్స్‌లో సుమారు 375 షాపులు తమకు కేటాయించాలని వ్యాపారులు కోరారు. క్రింది భాగంలోని రెండు అంతస్తులు తమకు కేటాయించాలని వ్యాపారులు మంత్రి పెమ్మసానిని కోరారు. తప్పనిసరిగా వారి సమస్యలను కార్పొరేషన్ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# విజన్-2020 విజయమే 2047 స్వప్నం సాకారానికి స్ఫూర్తి : చీఫ్ విప్ జీవీ



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో విజన్-2020 ద్వారా సాధించిన విజయాలే 2027 స్వప్నం సాకారానికి స్ఫూర్తి అని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. చంద్రబాబుకు, జగన్‌కు బాధ్యతగల తండ్రి ప్రణాళికలు, తాగుబోతు కొడుకు చేసిన దివాళాకోరు పనులకు ఉన్నంత తేడా ఉందని, అది ప్రజలు ఇప్పటికే గమనించారని ఎద్దేవా చేశారు. ప్రజల భాగస్వామ్యం, ఎన్డీయే ఆధ్వర్యంలో సుస్థిర ప్రభుత్వంతోనే విజన్-2047 తప్పక నెరవేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీలో ఈ మేరకు జరిగిన చర్చలో మాట్లాడుతూ... ఎన్డీయే ప్రభుత్వం ఆకాంక్ష, చంద్రబాబు ఆశయం ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో 2047 కల్లా అన్ని రంగాల్లో నంబర్-1గా నిలబడాలన్న లక్ష్యం సాధించడమే అన్నారు. పేదరిక నిర్మూలన కోసం తీసుకున్న ఇంటికో పారిశ్రామికవేత్త నినాదం తప్పక ఫలితాలు ఇస్తుందని తెలి పారు. చంద్రబాబు అప్పట్లో విజన్-2020 అంటే కొందరు నమ్మలేదని, కంప్యూటర్లు అన్నం పెడతాయని అనుమానం వ్యక్తం చేసిన వారికి సైబరాబాద్ అభివృద్ధే ఒక నిదర్శనమన్నారు. 1996 లో ఉమ్మడి ఏపీ ఐటీ ఆదాయం రూ.5వేల కోట్లు ఉంటే 2023-24లో హైదరాబాద్ నుంచి 2.7లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయన్నారు. ప్రతి రైతు కుటుంబం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు వచ్చారని.. వారంతా దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. అమెరికా తలసరి ఆదాయం 60వేల డాలర్లుగా ఉంటే... అక్కడ స్థిరపడిన తెలుగువారి తలసరి ఆదాయం లక్షా 20వేల డాలర్లని గుర్తు చేశారు. ఇప్పుడు అదే తరహాలో ఏపీకి 2047లో తలసరి ఆదాయం రూ.35లక్షలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారని.. తప్పక సాధిస్తామన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు చేసిన అభివృద్ధిని జగన్ సర్వనాశనం చేశాడని ఆ కలలన్నీ ఇప్పుడు తిరిగి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ చేసిన తప్పిదాలు, ఆలస్యంతో పోలవరం, అమరావతి నిర్మాణ వ్యయం వేల కోట్లు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో రైతుల ఆదాయం నంబర్-1 స్థానంలో ఉంటే జగన్ ఆత్మహత్యల్లో 3వ స్థానంలో నిలిపారన్నారు. నీతి ఆయోగ్ నివేదికల ప్రకారం నాడు నాణ్యమైన విద్యలో ఏపీ 3వ స్థానంలో ఉంటే... జగన్ 19వ స్థానానానికిపడేశారన్నారు. పట్టిసీమ ద్వారా రూ. 50వేల కోట్ల దిగుబడులు సాధిస్తే దాన్నీ కూడా ఆపేశారని వాపోయారు. నాడు రూ. 5లక్షల కోట్ల పెట్టుబడులతో 5.14 లక్షల ఉద్యోగాలు కల్పించామని, అప్పట్లో 4శాతం ఉన్న నిరుద్యోగాన్ని జగన్ 24శాతానికి చేర్చారన్నారు. అందు కే ప్రభుత్వానికి ప్రభుత్వానికి ఉన్న ఈ తేడాను గమనించి ప్రజలు ఎన్డీయేతోనే ఉంటే స్వర్ణాంధ్రప్రదేశ్ స్వప్నం తప్పక సాధించితీరతామన్నారు. దుర్మార్గులకి అవకాశం ఇవ్వకూడదని సూచించారు.

# అన్నా క్యాంటీన్‌లో అల్పాహారాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా



గుంటూరు (చైతన్యరథం): ప్రతి పేదవాడు కడుపునిండా భోజనం తినాలి అనే సంకల్పంతో స్థాపించిన అన్నా క్యాంటీన్‌లు సంతృప్తికరంగా నడుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం శివారు ప్రాంతాల్లో పర్యటించిన ఆమె... మిర్చి యార్డు వద్దనున్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ ప్రజలతో ముచ్చటించి, రైతులతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్‌ను క్యాంటీన్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్‌లో అల్పాహారం మొదలు భోజనం వరకు చాలా బాగున్నాయని ప్రజలు ఎమ్మెల్యే వద్ద హర్షం వ్యక్తం చేశారు. మిర్చి యార్డుకు స్థానిక రైతు కూలీలతో పాటు ఇతర జిల్లాల నుండి రైతులు వస్తుంటారని, దానికి అనుగుణంగా రోజువారి ఇచ్చే టోకెన్ల సంఖ్యను పెంచే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరారు.

# రాష్ట్రపతి అల్పాహార విందుకు హాజరైన ఎంపీ కేశినేని



ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాల ఎంపీలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ అల్పాహార విందు ఇచ్చారు. సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఎంపీలకు అల్పాహార విందు ఇచ్చారు. ఈ విందులో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ విశేషాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ఓం బిర్లాతోపాటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు. ఈ అల్పాహార విందుకు ఆహ్వానించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు ఎంపీలు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# బీపీటీ ధాన్యానికి కనీస మద్దతు ధర దక్కాలి

## •అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి డిమాండ్



నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరులో వ్యవసాయ సీజన్ భిన్నంగా ఉంటుందని మాజీ మంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ ప్రస్తుతం మొదటి పంట చేతికొచ్చి వరికోతలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా రైతులు బీపీటీ, కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకాలను సాగుచేశారని వెల్లడించారు. కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ సాగు చేసిన రైతులకు పెద్దగా ఇబ్బందులు లేవని, కానీ బీపీటీ పండించిన రైతులకు మాత్రం కనీస మద్దతు ధర లభించడం లేదని సభదృష్టికి తీసుకు వచ్చారు. కనీస మద్దతు ధర పుట్టికి రూ.19700 ఉండగా బీపీటీ ధాన్యాన్ని రూ.16 వేలు, 17 వేలకే అమ్ముకోవాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పుట్టికి రూ.2 వేలు నుంచి 3 వేలు నష్టపోతున్నారని, ఒక్కో ఎకరాకు రూ.12 వేల వరకు నష్టం వస్తోందని వివరించారు. ఇటీవల సివిల్ సప్లయిస్ మినిస్టర్ నాదెండ్ల మనోహర్ జిల్లా ఎమ్మెల్యేలతో టెలి కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారని గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా బీపీటీ రకం పంటను సుమారు 1..50 లక్షల ఎకరాల్లో సాగుచేసివున్నారన్నారు. 2018లో నెల్లూరు జిల్లాలో సాగుచేసిన బీపీటీ రకం ధాన్యంలో విరుగుళ్ల సమస్య వస్తే రాత్రి 11 గంటలకు కలిసి సీఎం చంద్రబాబు నాయుడు దగ్గర కూర్చుకుని క్వింటాలుకు రూ.200 బోనస్ రైతులకు ఇప్పించామన్నారు. ఇప్పుడు రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్ శాఖ మంత్రులు చర్యలు సుకోవాలని కోరారు.

# జాతీయ కామధేను ప్రాజెక్టును కాపాడండి

## •అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్



అమరావతి, (చైతన్యరథం): నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండలం చింతల దేవి పంచాయతీలో ఏర్పాటు చేసి ఉన్న జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్ అభివృద్ధిపై ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో తమ గళం వినిపించారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఘనచరిత్ర కలిగిన జాతీయ కామధేను ప్రాజెక్టు అభివృద్ధికి ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహకారంతో 2015లో జాతీయ కామధేను ప్రాజెక్టుగా రూపాంతరం చెంది అంచలంచెలుగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో మరుగున పడిందన్నారు. ముఖ్యంగా తాగునీటి కొరత ఉందని ఈ సమస్య తీరేందుకు 2.5 కోట్లతో అందుబాటులో ఉన్న రాళ్లపాడు ప్రాజెక్టు నుండి నీటిని సరఫరా చేసుకోవచ్చన్నారు. 2500 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ బ్రీడింగ్ సెంటర్లో పశువైద్య కళాశాలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి మంత్రి అచ్చం నాయుడు సమాధానం చెబుతూ రాష్ట్రంలో ఇప్పటికే నాలుగు పశువైద్య కళాశాలలు ఉన్నాయని, ఇంకొక కళాశాల ఏర్పాటు చేసేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్‌ను అభివృద్ధి చేసుకునేందుకు అక్కడ సౌకర్యాలు కల్పించేందుకు నిపుణుల పర్యవేక్షణ కమిటీ ఆ ప్రాంతంలో తిరిగి అధ్యయనం చేసిన తర్వాత నివేదిక ప్రకారం అంచనాలు వేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. నిపుణుల బృందం పరిశీలన అనంతరం తాను కూడా అక్కడ పరిశీలించి త్రాగునీటి సమస్యను అధిగమించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. దేశంలో రెండు కామధేను ప్రాజెక్టులు ఉండగా ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోని చింతల దేవి వద్ద ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం కామధేను ప్రాజెకును పరిశీలించి సమస్యలు తెలుసుకుని తమ వాణి ద్వారా బ్రీడింగ్ సెంటర్ అభివృద్ధిపై పడుతున్న తపనను గమనిస్తున్న రాష్ట్ర ప్రజలే కాకుండా నియోజకవర్గం ప్రజలు సీనియర్ సిటిజెన్లు మేధావులు, సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రకాశం జిల్లాకు మరో మణిహారం

గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రకాశం జిల్లాకు మరో మణిహారం కానుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన బెంగళూరు- కడప, విజయవాడ(బీకేవీ) ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి-544జీ నిర్మిస్తున్నారు. ఆరు వరుసలతో ప్రస్తుతం పనులు చకచకా సాగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ రహదారి: పనుల్లో వేగం పెంచేందుకు మొత్తం అయిదు ప్యాకేజీలుగా విభజించి జిల్లాలోని ఏడు మండలాల మీదుగా ఈ రాచబాటను నిర్మిస్తున్నారు. అన్ని ప్యాకేజీల్లోనూ మట్టితో లోతట్టు ప్రాంతాలను పూడ్చి కంకర పేర్చి తారుతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నారు. బాటకు ఇరువైపులా వాన నీటి ప్రవాహానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేస్తున్నారు. వాగులు, పంట కాలువలపై వంతెనలు కడుతున్నారు.

# ఏప్రిల్ 9 నుంచి బడి పిల్లలకు సమ్మెటివ్-2 పరీక్షలు



రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెట్ పాఠశాలలకు మార్చి 15 ఒంటి పూట బడులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బడులు పనిచేస్తున్నాయి. ఇక విద్యార్థులకు వేసవి సెలవులకు ముందే వార్షిక పరీక్షలు నిర్వహించవల్సి ఉండగా.. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ తాజాగా విడుదల చేసింది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు ఒంటి పూట బడులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మార్చి 15 నుంచి అన్ని పాఠశాలల్లో ఒంటి పూట బడులు ప్రారంభమైనాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బడులు పనిచేస్తున్నాయి. అంటే మధ్యాహ్నం విద్యార్థులకు భోజనం అందించి ఇళ్లకు పంపించేస్తారన్నమాట. అయితే విద్యార్థులకు వేసవి సెలవులకు ముందే వార్షిక పరీక్షలు నిర్వహించవల్సి ఉంది. ఇందుకోసం ఒకటి నుంచి తొమ్మిది తరగతి విద్యార్థులకు సమ్మెటివ్ 2 (ఎస్ఏ-2) పరీక్షలు ఏప్రిల్ 9 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. పరీక్షల అనంతరం జవాబుపత్రాలను కూడా వెంటనే మూల్యాంకనం చేసి, మార్చి 23న ఫలితాలు వెల్లడించనున్నారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, ప్రోగ్రెస్ కార్డులు అందించాలని విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మార్చి 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఇస్తారు. తిరిగి జూన్ 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు తెరచుకోనున్నాయి.

# పెట్టుబడుల గమ్యస్థానంగా భారత్

## •ప్రపంచంలోనే 5వ అత్యంత ఆకర్షణీయమైన దేశంగా ఇండియా



నెల్లూరు (చైతన్యరథం): దేశంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం లోకసభలో పలు అంశాలపై ఆయన ప్రశ్నలు వేశారు. పీడబ్ల్యూసీ సర్వే ప్రకారం దేశం ప్రపంచంలోనే 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్న విషయం వాస్తవమేనా అని ఆరా తీశారు. అయితే 2020లో 4వ స్థానం నుండి 2022లో 5వ స్థానానికి, 2023లో 9వ స్థానానికి పడిపోయిన కారణంగా ప్రభుత్వం ఈ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి, ఈ ర్యాంకును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు విధానపరంగా తీసుకుంటున్న చర్యలు, అదనపు మూలధన వ్యయం, దేశీయ డిమాండ్ ఈ విషయంలో ఎంతవరకు సహాయపడతాయో తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పీడబ్ల్యూసీ 27వ వార్షిక గ్లోబల్ సర్వే ప్రకారం, భారతదేశం ప్రపంచంలో 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్నారు. అయితే, ప్రైవేట్ సంస్థలు, రేటింగ్ ఏజెన్సీలు, ఇతర ప్రపంచ సంస్థలు ఎప్పటికప్పుడు భారత ఆర్థిక వ్యవస్థపై తమ సొంత అంతర్గత పరిశోధనలను ప్రచురిస్తాయని, భారత ప్రభుత్వ అభిప్రాయాన్ని సూచించవని తెలియజేశారు. భారతదేశంలో దేశ, విదేశీ పెట్టుబడులను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్-అప్ ఇండియా, గతిశక్తి, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రామ్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రోత్సహించడం, నేషనల్ సింగిల్ విండో సిస్టమ్, ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్, ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్, ఎఫ్‌డీఐ విధానం సరళీకరణ వంటివి దేశంలోకి పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడానికి ఉపకరిస్తాయన్నారు. ప్రభుత్వం పెట్టుబడిదారుల-స్నేహపూర్వక విధానాన్ని అమలు చేస్తోందని, కొన్ని ముఖ్యమైన రంగాలు మినహా చాలా రంగాల్లో 100% విదేశీ పెట్టుబడులను ఆహ్వానించామన్నారు. దేశంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎఫ్‌డీఐల పరిమితులను పెంచడం, నియంత్రణ అడ్డంకులను తొలగించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్ర బడ్జెట్-2025లో బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 74% నుండి 100%కి పెంచామన్నారు. మూలధన వ్యయం, బలమైన దేశీయ డిమాండ్ దేశం యొక్క పెట్టుబడి ఆకర్షణను గణనీయంగా పెంచుతాయన్నారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం.. వ్యాపార ఖర్చులను తగ్గించి, ఉత్పాదకతను మెరుగుపరుస్తుందన్నారు. అందుకే కేంద్ర బడ్జెట్ 2025 ప్రకారం మొత్తం మూలధన వ్యయం 2024-25లో రూ.10.18 లక్షల కోట్లు కాగా, ఇది 2023-24లో రూ.9.49 లక్షల కోట్లుగా ఉందన్నారు. పన్నుల చర్యలతో సహా దేశీయ డిమాండ్‌ను పెంచడానికి, తద్వారా దేశీయ వినియోగం, పొదుపులు మరియు పెట్టుబడులను పెంచడానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టబడ్డాయని

# ఎమ్మెల్సీగా ధ్రువీకరణ పత్రం అందుకున్న బీద రవిచంద్ర



నెల్లూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుల కోటాలో శాసనమండలి సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర గెలుపు ఏకగ్రీవం అయినట్లు ధృవీకరిస్తూ శాసన మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వనితా రాణి అసెంబ్లీ నందు డిక్లరేషన్ (ధ్రువీకరణ పత్రం) ఫాంను ఎమ్మెల్సీ బీదకు అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, నారా లోకేష్‌కి, రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. బీదతో పాటు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ , ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉమ్మడి నెల్లూరు జిల్లా శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ తదితరులు ఉన్నారు.

# అధికారుల పొరపాటు.. ఒక పేపర్ బదులు మరో పేపర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు మొదలయ్యాయి. చివరి పరీక్షను రంజాన్ పండుగ ఆధారంగా మార్చి 31వ తేదీన కానీ, ఏప్రిల్ ఒకటవ తేదీన కానీ, నిర్వహించనున్నారు. 2024-2025 విద్యాసంవత్సరానికి గానూ రాష్ట్ర వ్యాప్తంగా 6,49,884 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నేపథ్యంలో అధికారులు కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. పరీక్ష సెంటర్ల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటోంది. ఎంత పగడ్బందీగా ప్లాన్ చేసినా.. కొన్ని చోట్ల తప్పులు జరుగుతూనే ఉన్నాయి. తెనాలి ఎన్ఎస్ఎం పాఠశాలలో అధికారులు పొరపాటు చేశారు. ఓ విద్యార్థికి స్పెషల్ తెలుగు ప్రశ్నాపత్రం పంపిణీ చేయడానికి బదులు సాధారణ ప్రశ్నాపత్రం పంపిణీ చేశారు. జరిగిన పొరపాటుపై అధికారులు అధికారులు విచారణ చేపట్టారు. జాబితా చూసుకోకుండా వేరే ప్రశ్నాపత్రం ఇచ్చిన ఇన్విజిలేటర్ను సస్పెండ్ చేశారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి స్ట్రాంగ్ రియాక్షన్

## •అవినీతిపై విచారణ చేయిస్తా.. ప్రజా సొమ్ము తిన్న వారి నుంచి కక్కిస్తా : ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం (చైతన్యరథం) : నగరపాలక సంస్థలో జరిగిన అవినీతిపై ఖచ్చితంగా విచారణ జరుగుతుందని.. ప్రజల సొమ్ము తిన్న వారి నుంచి అది కక్కిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతపురం నగర పాలక సంస్థలో జరిగిన బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలువురు కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే డంపింగ్ యార్డ్, కుక్కల ఆపరేషన్లతో పేరుతో జరిగిన అవినీతి గురించి ఎమ్మెల్యే ప్రసావించగా.. మేయర్ వసీం, పలువురు కార్పొరేటర్లు వాగ్వివాదానికి దిగారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మేయర్ అనగా.. ఎమ్మెల్యే కూడా స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు. ఈ అవినీతిపై కచ్చితంగా విచారణ జరుగుతుందని.. ఎవరెవరు ఎంత తిన్నారో.. ఎవరెవరి వాటాలు ఎంతో తేలుస్తామని..అంతే కాకుండా వారి నుంచి కక్కిస్తామని వ్యాఖ్యలు చేశారు. మరోవైపు నగరంలో రోడ్డు విస్తరణ పేరుతో విగ్రహాలు తొలగించాలని.. వాటిని అలాగే తిరిగి పునఃప్రతిష్టాంచాలన్నారు. ఇంకో సందర్భంలో ఈ 9నెలలుగా ఎలాంటి పనులు జరగలేదని కొందరు కార్పొరేటర్లు చెప్పగా.. ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ దెబ్బకు కనీసం పనులు చేయాలంటే కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పాలకసంస్థలో మొత్తం 135కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్టు తెలిపారు. నగరంలో చాలా సమస్యల్ని కార్పొరేటర్లు తమ దృష్టికి తీసుకొచ్చారని.. కచ్చితంగా వాటిని పరిష్కరిస్తామన్నారు. గత నాలుగేళ్లుగా జరిగిన పనులన్నీ ఈ తొమ్మిది నెలల కాలంలోనే చేసినట్లు వివరించారు. రుద్రంపేట రోడ్డు, శ్రీనగర్ కాలనీలో 80ఫీట్ రోడ్డుతో పాటు చాలా పనులు చేసినట్టు వివరించారు. త్వరలోనే డంపింగ్ యార్డ్ ను పూర్తిస్థాయిలో క్లియర్ చేస్తామని.. అక్టోబర్ రెండు తర్వాత ఒక టన్ను చెత్త కూడా కనిపించకుండా చేస్తామని స్పష్టం చేశారు. మరువవంక ప్రొటెక్షన్ వాల్ 88 కోట్లతో ప్రతిపాదనలు పంపామని..దీనిని మంజూరు చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి హామీ ఇచ్చినట్టు చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేస్తామని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని.. దీనికి ఇప్పటికే డీపీఆర్ కూడా సిద్ధం చేసినట్టు చెప్పారు. త్వరలోనే అది కూడా మంజూరవుతుందన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో 40 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు మొదలు పెట్టనున్నట్టు వివరించారు. నగరంలో అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు.

# పెనుమూరు పోలీస్ స్టేషన్‌కు కొత్త భవనం ! : హెూం మంత్రి అనిత



తిరుపతి, (చైతన్యరథం) తిరుపతి జిల్లా పెనుమూరు పోలీస్ స్టేషన్ కు నూతన భవనం నిర్మించడానికి కృషి చేస్తానని, ఎస్ఐ నియామకానికి చర్యలు తీసుకుంటామని హెూమ్ మంత్రి అనిత హామీ ఇచ్చారు. ఈ నెల ఆరవ తేదీన పెనుమూరు పోలీస్ స్టేషన్ సమస్యలపై టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి ఆమెకు లేఖ రాశారు. దానికి స్పందనగా ఆమె సోమవారం ఆయనకు సమాచారం అందించారు. పెనుమూరులో చాలా రోజులుగా ఎస్సై లేక పోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. దీని వల్ల ఎర్ర చందనం అక్రమ రవాణా చేసే వారు ఈ మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. అలాగే చావడి స్థలంలో పోలీసు స్టేషన్ భవనం నిర్మాణం చేయాలని కోరారు. గతంలో పోలీస్ స్టేషన్ చావడి భవనంలో ఉన్నదనీ తెలిపారు. అక్కడ నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఆ సమయంలో స్టేషన్‌ను తహశీల్దారు కార్యాలయం పక్కన ఉన్న చిన్న భవనంలోకి మార్చారని తెలిపారు. అయితే స్థానిక వైసీపీ నేత ప్రోత్సాహంతో చావడి స్థలం పూర్తిగా అగ్రికల్చర్ శాఖ వారికి కేటాయించాలని ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లి పోలీస్ స్టేషన్ నిర్మాణంపై స్టే తెచ్చారని తెలిపారు. తరువాత కేసు వాపసు తీసుకున్నారని, అయినా నిర్మాణం చేపట్టలేదని అవేదన వ్యక్తం చేసారు. ఈ విషయాలపై పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు.

# అందరి సహకారంతో ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి

వెలిగొండ (చైతన్యరథం): ఆరోగ్య కేంద్రాలను అందరి సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు మండలంలోని టీడీపీ నాయకులు, ప్రజలు నాగి రెడ్డిపల్లి ప్రభుత్వ అసుపత్రికి రూ.ఆరు లక్షల విలువ గల బెడ్లు, కుర్చీలు, టేబుల్స్, ఫ్రిడ్జ్, ఆపరేషన్ థియేటర్, మెడికల్ పరికరాలు అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఆసుప త్రిని సందర్శించి పరికరాలను పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అభి వృద్ధికి దాతలు సహకారం అందించడం అభినందనీయ మన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగు పర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు. అం దరి సహకారంతో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పది సంవత్సరాల తర్వాత సిజేరియన్ ప్రసవ సేవలు ప్రా రంభమయ్యాయని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ తమీమ్ అన్సారి యా సలహాతో కనిగిరి వైద్యశాలలో కంగారు మదర్ కేర్ విధానాన్ని తీసుకొచ్చినట్టు చెప్పారు. ఆసుపత్రిలో ఓపీల సంఖ్య పెరిగిందన్నారు.



# లోక్‌సభలో హిందూ ఆలయాల నిధులపై చర్చించిన జనసేన



అమరావతి (చైతన్యరథం): హిందూ ఆలయాలపై ప్రభుత్వాల నియంత్రణ గురించి లోక్‌సభలో కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చర్చించారు. హిందూ ఆలయాలు రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణలో, ఇతర మతాల ప్రార్థనా స్థలాలు స్వతంత్రంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న హిందూ ఆలయాల నుంచి వచ్చిన ఆదాయం ఎంత అని నిలదీశారు. ఆలయాల నుంచి వచ్చిన నిధులను ఇతర అవసరాల కోసం ఖర్చు చేశారా అని అడిగారు. ఆలయాలకు స్వతంత్రత కోరుతూ మత సంస్థల నుంచి డిమాండ్లు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించారు. ఈ విషయంపై కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

# మెప్మా ఆర్‌పీల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా



కడప (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పీలు తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డిని కోరారు. సోమవారం కడపలోని ఆయన నివాసంలో మెప్మా ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... "మహిళ వికాస్ యాప్ రద్దు చేయడం, జీతాలను ఆర్పీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలో జమ చేయడం. ఆర్పీలకి గల మూడు సంవత్సరాల కాల పరిమితిని రద్దు చేయాలి. గత 25 సంవత్సరాల నుండి పనిచేసిన ఆర్పిలకు సీవోలుగా పదోన్నతులు కల్పించాలి. సచివాలయ సిబ్బందిని మెప్మాలో విలీనం చేయకూడదు. 8000గా గల ఆర్పీల జీతాలను 18000 చేయాలి." తమ డిమాండ్లను టీడీపీ నేత ముందు ఉంచారు. తన దృష్టికి తీసుకువచ్చిన ఆర్పీల సమస్యలను ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని, వాటిని పరిష్కారం అయ్యేలా తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

# అవినాష్‌రెడ్డిని కాపాడుతున్న జగన్‌రెడ్డి



కర్నూలు (చైతన్యరథం): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నుంచి కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి కాపాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వై.ఎస్ జగన్ రెడ్డి చెప్పని అబద్దమే మళ్ళీ, మళ్ళీ చెప్పి... బూటకపు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో లెక్కకు మించి అరచకాలు జరిగాయని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. సొంత బాబాయి వివేకానందరెడ్డిని హత్యచేయించడం, తల్లినీ, చెల్లిని ఇంటి నుంచి తరిమేసి వారిపై కేసులు పెట్టించడం వంటి దురాగతాలకు పాల్పడింది చాలక వివేకానందరెడ్డి హత్యకు కేసులో అవినాష్‌రెడ్డిని కాపాడేందుకు జగన్ సాక్షులను మట్టుబెట్టిస్తున్నారని అన్నారు. తాను పాలించిన 5 సంవత్సరాల కాలంలో అవినాష్‌రెడ్డిని రక్షించారనీ, వివేకానందరెడ్డి హత్యలో ఆరోపణలున్న దోషులను వెనకేసుకొని వస్తున్న జగన్‌రెడ్డి తన నిజస్వరూపం బయటపడకుండా సాక్షులను మట్టుబెడుతున్నారని ఆరోపించారు. సొంత బాబాయిని హత్య జరిగితే జగన్ సీఎం పదవిలో ఉన్నప్పుడు వారిని ఎందుకు అరెస్టు చేయించలేకపోయారనీ, తన హస్తమన్నందు వల్లనే జగన్ ఇలా వారికి రక్షణగా నిలుస్తున్నారని అన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోలీస్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలి చిత్తూరు జిల్లాకు చెందిన మరొక నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అటవి భూములను కబ్జాచేసి కోట్లు గడించారనీ, అడ్డువచ్చిన తెలుగుదేశంపార్టీ వారిని హత్యలు చేయిస్తున్నారనీ, ఇటీవల తెలుగుదేశంపార్టీ కార్యకర్తను కిరాతకంగా హత్య చేయించారనీ, ఇలాంటి వారిని పోలీసులు చట్టం ఎందుకు ఉపేక్షిస్తుందో అర్థం కావడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వీరిపై పోలీస్ కేసు నమోదు చేయించి అరెస్టు చేయాలన్నారు.

# చంద్రబాబుతోనే సామాజిక న్యాయం



నెల్లిమర్ల (చైతన్యరథం): సీఎం నారాచంద్రబాబునాయుడుతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఏపీ మార్కెఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు తెలిపారు. మండలంలోని పోలిపల్లిలో చంద్రబాబునాయుడు శాసనసభలో తొలిసారి ప్రమాణం స్వీకారం చేసి 47 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తొలిసారిగా చంద్రబాబు ఎమ్మెల్యేగా శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసి నేటితో 47 ఏళ్లు పూర్తయ్యిందని తెలిపారు. సైబరాబాద్, అమరావతి, పోలవరం సృష్టికర్త, అభివృద్ధి ప్రదాత చంద్రబాబే అన్నారు. చంద్రబాబు తనకున్న విజన్‌తో తెలుగు రాష్ట్రాను అభివృద్ధి చేయడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పలస్వామి, కందిరమణ, ఎ.శ్రీను పాల్గొన్నారు.

# హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌కు షాక్

**సైబర్ నేరగాళ్ల టోకరా, దారి మళ్లిన రూ. 55 లక్షలు**



సైబర్ కేటుగాళ్లు ఏకంగా భారత్‌లో విమానాలు తయారుచేసే హిందుస్థాన్ ఏరోనాటిక్ సంస్థను మోసం చేసి రూ.55 లక్షలు కొల్లగొట్టారు. తాజాగా హాల్ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ సింగ్ పోలీస్ కంప్లైంట్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. 2024 మే నెలలో హాల్ సంస్థ మూడు ఫైటర్ విమానాలకు సంబంధించిన కొన్ని పార్టుల కోసం అమెరికాలోని కంపెనీని సంప్రదించింది. ఆ సంస్థ కూడా దీనికి ఈ-మెయిల్ లో స్పందించింది. ఇదే సమయంలో ఎక్కడో ఒక ఫేక్ ఈ-మెయిల్ దీనిలోకి వచ్చి చేరింది. మోసగాళ్లు దాని ఆధారంగా డబ్బులు వసూలు చేశారు. "విమానాల విడిభాగాల కోసం హాల్, అమెరికాకు చెందిన పీఎస్ ఇంజినీరింగ్ ఇన్కార్పొరేటెడ్ అనే సంస్థను సంప్రదించింది. అధికారిక ఈమెయిల్ నుంచే సంప్రదింపులు మొదలయ్యాయి. మధ్యలో ఎక్కడో ఈమెయిల్ అక్షరం తొలగించిన ఈ మెయిల్ నుంచి సందేశాలు రావడం మొదలైంది. దీనిని అధికారులు గుర్తించలేదు. ఆ మెయిల్ సూచించిన ఖాతాకు 63,000 (రూ.55 లక్షలు) డాలర్లు చెల్లించారు. కానీ, పీఎస్ ఇంజినీరింగ్ మాత్రం తమకు డబ్బు ముట్టలేదని చెప్పడంతో అధికారులు కంగారుపడి ఖాతాలను పరిశీలించారు. చివరికి తప్పుడు ఈమెయిల్ సూచించిన ఖాతాకు డబ్బు వెళ్లినట్లు గుర్తించారు" అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అమెరికా కంపెనీనే మోసం చేసిందా.. లేక భారత కంపెనీలు ఏమైనా చేశాయో స్పష్టత లేదని అధికారి అన్నారు.

## ఔరంగజేబు సమాధి వద్ద భారీ భద్రత

**- సందర్శకులకు ఆంక్షలు కట్టుదిట్టం**




మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని కూల్చివేయాలన్న డిమాండ్లు వస్తున్న వేళ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆ ప్రాంతంలో పోలీస్ భద్రతను కట్టుదిట్టం చేసింది. మహారాష్ట్రలోని శంభాజీనగర్ జిల్లా ఖుల్దాబాద్లో ఉన్న సమాధి వద్దకు వెళ్లే సందర్శకులపై ఆంక్షలు విధించింది. ఇకపై ఎవరైనా వెళ్లే భద్రతా సిబ్బంది వద్ద ఉన్న రిజిస్టర్లో సంతకాలు చేయడంతో పాటు గుర్తింపు పత్రాలను చూపించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు, ఔరంగజేబు సమాధిని కూల్చాల్సిందేనంటూ విశ్వహిందూ పరిషత్ పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టడంతో పాటు మెమోరాండాలను సమర్పించింది. అంతేకాకుండా, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఇచ్చిన మెమోరాండంలో పలు అంశాలను ప్రస్తావించింది. మత మార్పిడికి నిరాకరించారన్న నెపంతో సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ ఇద్దరు తనయులను ఔరంగ జేబు హత్య చేశారని, మరాఠా యోధుడు ఛత్రపతి శంభాజీ మహారాజును హింసించి చంపేశారన్నారు. పలు ఆలయాలను ధ్వంసం చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందువల్ల ఔరంగజేబు స్మారక చిహ్నం ఏదైనా బాధ, బానిసత్వానికి చిహ్నమని అందుకే ఆ సమాధిని పూర్తిగా కూల్చివేయాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తామే సమాధి వరకూ కవాతు నిర్వహించి కూల్చివేస్తామని హెచ్చరించిన తరుణంలో స్థానిక అధికార యంత్రాంగం భద్రతను కట్టుదిట్టం చేయడం గమనార్హం. ఔరంగజేబు సమాధి వద్ద ఛత్రపతి శంభాజీనగర్ గ్రామీణ పోలీసులతో భద్రతను పెంచారు. ప్రవేశ ద్వారం నుంచి సమాధి స్థలం వరకు పలు సెక్యూరిటీ పోస్టులను ఏర్పాటు చేశారు. మొత్తం 50మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో 20మంది స్థానిక పోలీసులు కాగా.. మరో 20మంది రిజర్వు పోలీసులను మోహరించినట్లు పేర్కొన్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో సమాధి వద్ద సందర్శకుల తాకిడి తగ్గింది.

# ఉగ్రవాదంపై ఉక్కుపాదమే

**- భారత వైఖరి మారదు : ప్రధాని మోదీ**



ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ప్రధాని నరేంద్రమోదీ తేల్చిచెప్పారు. 2019లో క్రైస్ట్ చర్చ్ నగరంపై జరిగిన దాడి అయినా.. 2008లో ముంబయిపై దాడి అయినా తమవైఖరి ఒకటే అని స్పష్టంచేశారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సహకారాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. మనదేశంలో పర్యటిస్తోన్న న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అనంతరం మోదీ ఈ విధంగా స్పందించారు. న్యూజిలాండ్లో కొన్ని శక్తులు భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయాన్ని ఆ దేశ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఇక భేటీలో భాగంగా వాణిజ్యం, రక్షణ, విద్య, వ్యవసాయం వంటి రంగాలపై వారి మధ్య చర్చలు జరిగాయి.

రక్షణ రంగంలో రెండు దేశాల మధ్య సహకారాన్ని కొనసాగించే దిశగా ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. అలాగే పరస్పర ప్రయోజనకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. ఈ అగ్రిమెంట్‌తో ఇరుదేశాలకు ఉపయోగపడే రీతిలో వాణిజ్య సామర్థ్యం పెరుగుతుందని, పాడిపరిశ్రమ, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా వంటి రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశాయి. తాము అభివృద్ధివాదాన్ని కోరుకుంటున్నామని, విస్తరణవాదాన్ని కాదని ఇరు దేశాలు వెల్లడించాయి. 2019 లో క్రైస్ట్‌చర్చ్ నగరంలోని మసీదుపై జరిగిన ఉగ్రదాడి ఘటనలో 51 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీనినే మోదీ ప్రస్తావించారు.

## కోర్టులో నానుతున్న రన్యా కేసు

**- తెరపైకి భర్త జతిన్ పేరు**



దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు కేసులో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. రన్యతో తనకు గత నవంబరులో వివాహమైందని, అయితే డిసెంబర్ నుంచే తాము విడిగా ఉంటున్నామని ఆమె భర్త జతిన్ హుక్కేరి కోర్టులో వెల్లడించారు. తాము అధికారికంగా విడిపోలేదని, అయితే కొన్ని కారణాల వల్ల వేరుగా జీవిస్తున్నామని చెప్పారు. స్మగ్లింగ్ కేసులో అరెస్టు నుంచి మినహాయించాలని కోరుతూ వేసిన పిటిషన్‌లో భాగంగా ఈ విషయాన్ని వెల్లడించారు. తదుపరి విచారణ వరకు హుక్కేరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గతవారం కర్ణాటక హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. మార్చి 24వరకు అవి అమల్లో ఉంటాయి. ఆ తర్వాతే హుక్కేరి ప్రస్తుతం చేసిన అభ్యర్థనకు వ్యతిరేకంగా తాము పిటిషన్ వేస్తామని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. కర్ణాటక డీజీపీ ర్యాంకు అధికారి కె.రామచంద్రరావు.. రన్యకు సవతి తండ్రి. ఆయన గతంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆమె కార్యకలాపాలతో ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. నాలుగు నెలల క్రితమే ఆమెకు వివాహం అయ్యిందని, అప్పటి నుంచి తమ ఇంటికి రాలేదన్నారు. భర్తతో పాటు ఆమె ఎటువంటి వ్యాపార లావాదేవీలు చేస్తున్నారనే విషయం తమకు తెలియదన్నారు. తాజా పరిణామంతో షాకుకు గురయ్యామని, చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఈ క్రమంలోనే జతిన్ పేరు వెలుగులోకి వచ్చింది. నాలుగు నెలల కిందటే బెంగళూరులోని పంచతార హోటల్ తాజ్ వెస్ట్ ఎండ్‌లో రన్య, జతిన్‌ల వివాహం జరిగింది. వివాహం అనంతరం ల్యావెల్లీ రోడ్డులోని విలాసవంతమైన అపార్ట్‌మెంటులో వారు ఉంటున్నారు. ఆర్వీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సును జతిన్ పూర్తి చేశారు. ఇంటీరియర్ డిజైనర్‌గా నగరంలో ఒక రెస్టారెంటు యజమానిగా ఉన్న జతిన్ ముంబయి, దిల్లీలకు తన వ్యాపారాన్ని విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ కలిసి పలుమార్లు దుబాయ్ వెళ్లివచ్చారని విచారణలో వెల్లడైంది.

## మళ్లీ హైకోర్టులోనే ఆర్జీకర్ వైద్యురాలి హత్య కేసు

**తాజాగా విచారణకు అనుమతించిన సీజే**

దిల్లీ: ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై గత ఏడాది జరిగిన హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మళ్లీ సీబీఐ విచారణ జరిపించాలని మృతురాలి తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సుప్రీంకోర్టు తాజాగా ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టులో ఈ పిటిషన్‌ను కొనసాగించొచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసుకు సంబంధించి ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చింది. శిక్ష ఖరారు చేయడానికి ముందు.. తాను ఏ నేరం చేయలేదని ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించారని సంజయ్ తన వాదనలు వినిపించాడు. కాగా ఈ కేసులో కోర్టు అతడికి జీవిత ఖైదును విధిస్తూ తీర్పు వెలువరించింది.

# భారత రక్షణ మంత్రితో అమెరికా ఇంటెలిజెన్స్ అధికారుల భేటీ

**- పలు కీలక అంశాలపై చర్చ**



రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌తో అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ అధికారులు భేటీ అయ్యారు. సౌత్ బ్లాక్ లో ఈ సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతాపరమైన సంబంధాల బలోపేతం, ఇంటెలిజెన్స్ షేరింగ్ వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. సీమాంతర ఉగ్రవాదం కూడా వీరి చర్చల అజెండాలో ఉంది. ఓ రక్షణ ఒప్పందంపైనా చర్చలు జరిగినట్లు సమాచారం. భారత్‌లో రెండున్నర రోజుల పర్యటనకు తులసీ న్యూఢిల్లీకి వచ్చారు. ఆమె గ్లోబల్ ఇంటెలిజెన్స్ కాంక్లేవ్లో కూడా పాల్గొన్నారు. ట్రంప్ రెండోవిడత కార్యవర్గంలోని సీనియర్ స్థాయి అధికారి భారత్ను సందర్శించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇప్పటికే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబాల్ తో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య నిఘా సమాచార పంపిణీ, సాంకేతిక పరిజ్ఞాన సహకారాన్ని పెంపొందించుకోవడం, భారత్- అమెరికాల ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుగుణంగా భద్రత రంగంలో బంధాన్ని బలోపేతం చేసుకోవడంపై వారిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఇండో-పసిఫిక్, ఖలిస్థానీ ఉగ్రవాదం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

**మోదీ, ట్రంప్ సమష్టి లక్ష్యాలపై దృష్టి**

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంచి మిత్రులని తులసీ గబ్బర్డ్ పేర్కొన్నారు. "వారు సమష్టి లక్ష్యాలపై దృష్టిపెట్టారు. భారత్-అమెరికా సంబంధాలు ఎంతో పురాతనమైనవి. వాటిని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనాలను గుర్తిస్తున్నాయి. శాంతి, సుసంపన్నత, స్వేచ్ఛ, భద్రత వంటి అంశాలు కేంద్రంగా ఇవి ఉన్నాయి. మన రెండు గొప్ప దేశాలకు ఉత్తమ నాయకులు ఉన్నారు. వారు మంచి మిత్రులు. సమష్టి లక్ష్యాలు, పరస్పర ప్రయోజనాలపై దృష్టిపెట్టారు. ఇక ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చాలా స్పష్టమైన వైఖరితో చూస్తున్నారు. ఆయన దృష్టి మొత్తం శాంతిస్థాపనపైనే ఉంది. యుద్ధాన్ని ముగించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. చర్చలు ఇప్పుడే మొదలయ్యాయి" అని తులసీ ఓ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆదివారం డోభాల్ అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ దేశాల నిఘాధిపతులు సదస్సులో పాల్గొనడానికి తులసీ భారత్కు వచ్చారు. ఈ సదస్సులో కెనడా నిఘాధిపతి డేనియల్ రోజర్స్, యూకే జాతీయ భద్రత సలహాదారు జొనాథన్ పావెల్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# నేడు పుతిన్‌తో ట్రంప్ చర్చలు

## ఫోన్‌లో మాట్లాడుకోనున్న యూఎస్ రష్యా అధినేతలు



రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అగ్రరాజ్యం పలు ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్‌తో చర్చలు జరపడానికి సిద్ధమవుతున్నట్టు వెల్లడించారు. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ధ్రువీకరించింది. ఇరుదేశాల అధ్యక్షులు మంగళవారం ఫోన్‌లో చర్చలు జరపనున్నట్టు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అయితే వారు ఏ అంశంపై మాట్లాడుకోనున్నారనే విషయాన్ని మాత్రం తెలుపలేదు. మంగళవారం తాను పుతిన్‌తో చర్చలు జరపనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇందులో తాము భూమి, పవర్‌ప్లాంట్ల గురించి కూడా చర్చించుకోనున్నట్లు తెలిపారు. కొన్ని ఆస్తులను రష్యా- ఉక్రెయిన్ మధ్య విడదీయడంపై ఇప్పటికే ఆయనతో మాట్లాడానని అన్నారు. ఈ వారంలోనే అమెరికా- రష్యా నేతలు చర్చలు జరుపుతారని శ్వేతసౌధం ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ ప్రకటన తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకొన్నాయి. ట్రంప్ రెండో దఫా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత 'రష్యా-ఉక్రెయిన్' వ్యవహారంపై ఫిబ్రవరిలో తొలిసారి పుతిన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. ఇదే విషయమై జెలెన్ స్కీతో సమావేశమవ్వగా అది రసాభాసగా ముగిసిన విషయం తెలిసిందే. అనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడు మాట్లాడుతూ తాను ఆ విధంగా ప్రవర్తించి ఉండకూడదని.. తన చర్యలకు అమెరికా అధ్యక్షుడిని క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ ప్రజలు యుద్ధం ముగింపు కోసం ఎదురు చూస్తున్నారని.. ఎలాగైనా దీనిని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అగ్రరాజ్యాన్ని కోరారు. అందుకు ప్రతిఫలంగా యూఎస్‌తో పలు ఒప్పందాలు సైతం చేసుకున్నారు. మరోవైపు 30 రోజులపాటు కాల్పుల విరమణకు రష్యా- ఉక్రెయిన్లు సానుకూలంగానే ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

# మోదీ మాట మహా గొప్పది!

## 'సానుకూల' వ్యాఖ్యలపై చైనా ప్రశంస



భారత్-చైనాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరుకుంటున్నట్టు ప్రధాని మోదీ చెప్పడంపై అగ్రరాజ్యం చైనా స్పందించింది. మోదీ సానుకూల వ్యాఖ్యలు అభినందనీయమని, పరస్పర సహకారం ఇరుదేశాల విజయానికి దోహదపడుతుందని పేర్కొంది. అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రిడ్మన్ పాడ్‌కాస్ట్‌లో భారత్-చైనా సంబంధాలపై మోదీ సానుకూలంగా మాట్లాడిన నేపథ్యంలో చైనా ఈ విధంగా స్పందించింది. "గతేడాది అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భేటీ.. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటంతోపాటు వ్యూహాత్మక మార్గదర్శకత్వానికి దోహదం చేసింది. శతాబ్దాల చర్చల చరిత్రలో రెండు దేశాలు స్నేహపూర్వక సంప్రదింపులు కొనసాగించాయి. ఒకదానినుంచి మరొకటి నేర్చుకుంటూ మానవ నాగరికత, పురోగతికి కృషి చేశాయి. అభివృద్ధి చెందుతున్న రెండు అతిపెద్ద దేశాలుగా ఉన్న చైనా, భారత్‌లు.. పరస్పరం సహకారంతో అభివృద్ధిపథంలో దూసుకెళ్తున్నాయి" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతల ఉమ్మడి లక్ష్యాలకు అనుగుణంగా భారత్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందన్న విషయాన్ని ఆమె మరోసారి గుర్తుచేశారు. ఫ్రిడ్మన్ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్-చైనాల మధ్య వైరుధ్యాల పరిష్కారానికి చర్చలకే మొగ్గు చూపుతానని పేర్కొన్న సంగతి తెలిసిందే. వాస్తవాధీన రేఖవెంట 2020 ముందునాటి పరిస్థితులను నెలకొల్పేందుకు రెండు దేశాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరుకుంటున్నామని, అది ఘర్షణకు దారి తీయరాదని వ్యాఖ్యానించారు.

# లష్కరే చీఫ్‌కు భారీ భద్రత

### - గుర్తు తెలియని గన్‌మెన్ల భయం



పాకిస్థాన్‌లో గుర్తుతెలియని గన్‌మెన్ల భయంతో లష్కరే తోయిబా చీఫ్, 26/11 దాడుల మాస్టర్‌మైండ్ హాఫీజ్ సయీద్‌కు భద్రత గణనీయంగా పెంచినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అతడు ఉగ్రకార్యకలాపాల ఆరోపణలపై లాహోర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అక్కడ అతడికి కల్పించిన భద్రతను పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ సమీక్షించింది. మరోవైపు హాఫీజ్ కుటుంబీకులకు కూడా రక్షణ ఏర్పాట్లను కట్టుదిట్టం చేసింది. అతడి కుమారుడు తల్హా సయీద్‌కు సెక్యూరిటీని పెంచారు. హాఫీజ్ ఇటీవల తరచూ దాడులకు లక్ష్యంగా మారుతు న్నాడు. 2021లో అతడి ఇంటివద్ద భారీ పేలుడు చోటుచేసుకొంది. దానినుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. 2023లో ఇద్దరు టాప్ లష్కరే ఉగ్రవా దులు, హంజ్లా అదన్నాన్, రియాజ్ అహ్మద్లను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. వరుసగా హాఫీజ్ సన్నిహితులపై దాడులు జరగడం లష్కరేలో భయం పుట్టిస్తోంది. డిసెంబర్ 2024లో జరిగిన దాడిలో హాఫీజ్ తర్వాతి స్థానంలోని అబ్దుల్ రెహ్మాన్ మక్కీ మృతిచెందాడు. దీంతో భయపడిన హాఫీజ్ అతడి అంతిమయాత్రలో కూడా పాల్గొనలేదు. అతడి కుమారుడు మాత్రమే వెళ్లాడు. ఈ యాత్రలో పాక్‌లోని పలువురు కరుడుగట్టిన ఉగ్రవాదులు పాల్గొన్నారు.

లష్కరేలోని మరో మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది అబూ ఖతాల్‌ను శనివారం గుర్తుతెలియని గన్‌మెన్లు హత్య చేశారు. దాదాపు 10 నుంచి 20 రౌండ్లు అతడిపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో అతడితోపాటు.. ఓ సెక్యూరిటీ గార్డ్ కూడా ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. గతేడాది రియాసీలో యాత్రికుల బస్సుపై దాడి చేసిన కేసులో ఇతడు ప్రధాన సూత్రధారి. ఖతాల్ మరణంతో లష్కరేకు గట్టి ఎదురు దెబ్బతగిలిందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. అతడి స్థానాన్ని భర్తీ చేసే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు.

### అణుబాంబులు వాడకుండా

# రష్యాను ఒప్పించిన మోదీ



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం జరుగుతోన్న శాంతి ప్రయత్నాల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ తనవంతు కృషి చేస్తున్నారు. ఈక్రమంలో తాజాగా పోలాండ్ విదేశాంగ శాఖ సహాయమంత్రి వాడిస్లా టియోఫిల్ బార్తోషెఫ్స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ గొప్ప మాట సాయం చేసిందని కొనియాడారు. ఉక్రెయిన్‌పై అణు వ్యూహాత్మక ఆయు ధాలు వినియోగించకుండా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను మోదీ ఒప్పిం చారని వెల్లడించారు. "ప్రధాని మోదీ వార్సా (పోలాండ్ రాజధాని) పర్య టన మాకు ఎంతో ఉపయోగపడింది. మేం శాశ్వత, సుస్థిరశాంతిని కోరు కుంటున్నాం" అని బార్తో షెఫ్స్కీ మీడియాతో మాట్లాడారు. గత ఏడాది ఆగస్టులో మన ప్రధాని పోలాండ్‌లో పర్యటించిన సంగతి తెలి సిందే. అన్ని దేశాలూ అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాల్సిన ఆవశ్యకతను ఆ సందర్భంగా నొక్కి చెప్పారు. ఒక దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వ భౌమత్వం, రాజకీయ స్వతంత్రతలకు మరో దేశం భంగం కలిగించకూడ దని పేర్కొన్నారు. తర్వాత అక్కడినుంచి యుద్ధభూమి ఉక్రెయిన్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. అనంతరం మోదీ-జెలెన్ స్కీ మధ్య భేటీ జరిగింది. తాజాగా అమెరికాకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) పరిశోధకుడు లెక్స్ ఫ్రిడ్మాన్‌కు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ముఖాముఖిలో మోదీ మాట్లాడుతూ.. "రష్యా-ఉక్రెయిన్ మధ్య చర్చలు సాధ్యమైనప్పుడే వాటి మధ్యగల వివాదానికి పరిష్కారం లభిస్తుంది. యుద్ధక్షేత్రంలో ఎన్నటికీ పరిష్కారం దొరకదు. ఈ వ్యవహారంలో భారత్ తటస్థంగా లేదు. శాంతికి దృఢంగా కట్టుబడి ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధినేత జెలెన్ స్కీతో నాకు సత్సంబంధాలున్నాయి" అని పేర్కొన్న సంగతి తెలిసిందే.

# 'సుంకాల'పై తగ్గేది లేదు

### ఏప్రిల్ 2నుంచే అమలంటున్న ట్రంప్



తమ దేశ ఉత్పత్తులపై సుంకాలను విధిస్తున్న దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతి సుంకాలతో విరుచుకుపడుతున్నారు. తమ వ్యాపార భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25 శాతమున్న సుంకాలను 50 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకున్నట్టు ఇటీవల ప్రకటించారు. తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ.. తమ వ్యాపార భాగస్వాములపై ఏప్రిల్ 2నుంచి సుంకాలు విధిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండదని.. ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గేదే లేదని అన్నారు. సుంకాలపై ఏ దేశానికీ మినహాయింపులు కల్పించే ఉద్దేశం తమకు లేదని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. "ఏప్రిల్ 2" మన దేశానికి విముక్తి కలిగించే రోజు. ఇదివరకు అధికారంలో ఉన్న తెలివి తక్కువ అధ్యక్షులు తాము ఏమి చేస్తున్నామో కూడా తెలియకుండా మన సంపదను ఇతరులకు ఇస్తూ పోయారు. ప్రస్తుతం విధిస్తున్న సుంకాల ద్వారా అందులో కొంత భాగాన్ని తిరిగి పొందబోతున్నాము. ఇన్నాళ్లూ వారు మననుంచి వసూలు చేశారు. వాటన్నిటినీ తిరిగి వసూలు చేసుకోవడానికి ఆయా దేశాలపై అదనపు సుంకాలు విధిస్తున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు.

అమెరికా దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికో సహా ప్రపంచ దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుందని తెలిపారు. దీనిపై తమ వాణిజ్య మంత్రికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మరిన్ని రంగాల్లోనూ సుంకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. 'వారు మన ఉత్పత్తులపై 130శాతం సుంకాలు విధిస్తుంటే మనం ఏమీ విధించకపోవడం సరికాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత సుంకాల అమలు ప్రకటనతో అంతర్జాతీయ వాణిజ్య భాగస్వామ్య సంస్థల్లో ఆందోళన నెలకొంది.

# ఉక్రెయిన్‌కు ట్రంప్ మళ్లీ ఝలక్!



ఉక్రెయిన్ ఆక్రమణకు కారణమైన నాయకులపై దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన మల్టీ నేషనల్ గ్రూప్ నుంచి అమెరికా వైదొలగింది. వాస్తవానికి ఈ గ్రూప్ రష్యా అధినేత పుతిన్‌పై విచారణ జరపాల్సి ఉంది. దీంతో 'ది ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ది ప్రాసిక్యూషన్ ఆఫ్ క్రైమ్ ఆఫ్ అగ్రెషన్ అగైనెస్ట్ ఉక్రెయిన్' నుంచి అగ్రరాజ్యం వైదొలగనుంది. 2023లో ట్రంప్ కార్యవర్గం ఈ గ్రూప్‌లో చేరింది. అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన, దౌర్జన్యాలకు పాల్పడిన రష్యా, బెలారస్, ఉత్తర కొరియా, ఇరాన్లను బాధ్యులను చేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్ మాతృ సంస్థ అయిన ది యూరోపియన్ యూనియన్ ఏజెన్సీ ఫర్ క్రిమినల్ జస్టిస్ కో ఆపరేషన్‌కు మెయిల్ రూపంలో అమెరికా ఈ విషయాన్ని వెల్లడించవచ్చని సమాచారం. ఉక్రెయిన్- రష్యా యుద్ధం వ్యవహారంలో అమెరికా చాలా వేగంగా నిర్ణయాలు తీసుకొంటోంది. వేగంగా కాల్పుల విరమణ అమలు చేసేందుకు మంగళవారం ట్రంప్ నేరుగా రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో చర్చలకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు తిరిగి వస్తుండగా ఎయిర్ ఫోర్స్ వన్‌లో వెల్లడించారు. "నేను రేపు మంగళవారం పుతిన్‌తో చర్చలు జరపనున్నాను. మేము భూమి, పవర్ ప్లాంట్ల గురించి కూడా చర్చించనున్నాం. కొన్ని ఆస్తులను రష్యా- ఉక్రెయిన్ మధ్య విడదీయడంపై ఇప్పటికే మాట్లాడాను" అని ఆయన వ్యాఖ్యానించినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ రాయిటార్స్ పేర్కొంది.

### భారత్ దెబ్బకి.. పాక్ షాక్..

# నష్టాల్లో కూరుకుపోయిన పీసీబీ

## - ఛాంపియన్స్ ట్రోఫీతో ఏకంగా రూ. 740 కోట్లు లాస్!

2025 ఛాంపియన్స్ ట్రోఫీ వల్ల పాకిస్థాన్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన పాక్ ఆర్థికంగా భారీగా నష్టపోయినట్లు తెలుస్తోంది. టోర్నమెంట్ నిర్వాహణతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దాదాపు రూ. 740 కోట్లు నష్టపోయినట్లు కథనాలు వస్తున్నాయి. దీంతో నష్టాన్ని పూడ్చుకోవడానికి బోర్డు సతమతమవుతోంది. ఆటగాళ్ల ఫీజులు తగ్గించే ఆలోచన చేస్తున్నట్లు అక్కడి మీడియా పేర్కొంది.




దాదాపు 29 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నమెంట్ ఆతిథ్య హక్కులు దక్కించుకున్న పాకిస్థాన్ స్టేడియాల రెనోవేషన్ పనులపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే 58 మిలియన్ డాలర్లను రావల్పిండి, లాహెూర్, కరాచీ స్టేడియాల ఆధునీకరణ పనుల కోసం వెచ్చించింది. ఇక ఈవెంట్ సన్నాహాల కోసం మరో 40 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అంటే దాదాపు 98 మిలియన్ డాలర్ల ఖర్చు అయ్యింది!

అయితే హెూస్టింగ్ ఫీజు కింద పీసీబీకి 6 మిలియన్ డాలర్లే అందినట్లు తెలుస్తోంది. మరోవైపు టికెట్ విక్రయాలు, స్పాన్సర్‌షిప్‌లు కూడా అంతంత మాత్రంగానే వచ్చాయి. దీంతో పీసీబీకి దాదాపు 85 మిలియన్ డాలర్లు నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఇది పీసీబీకి కోలుకోలేని దెబ్బ అనే చెప్పుకోవాలి.

***ఫీజులు కట్?***

పీసీబీ ఇంతటి భారీ నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆటగాళ్ల ఫీజుల్లో కోత విధించాలని డిసైడ్ అయ్యిందట. ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును రూ. 40 వేల నుంచి రూ. 10 వేలకు పీసీబీ ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా తగ్గించినట్లు అక్కడి మీడియా పేర్కొంది. అలాగే ఆటగాళ్లకు 5 స్టార్ హెూటల్ వసతులను కూడా తగ్గించి, ఎకానమీ హెూటళ్లతో సర్దుకోవాలని బోర్డు సూచించినట్లు సమాచారం.

***అన్నీ చేదు అనుభవాలే***

దాదాపు 29ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నమెంట్‌కు ఆతిథ్య హక్కులు దక్కించుకుంటే స్వదేశంలో పాక్ ఆడింది ఒక్క మ్యాచ్ మాత్రమే. అందులోనూ పాకిస్థాన్ ఓడింది. హైబ్రిడ్ మోడల్ వల్ల భారత్‌తో మ్యాచ్ దుబాయ్‌లో ఆడగా, బంగ్లాదేశ్‌తో జరగాల్సిన మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. దీంతో ఒక్క విజయం సాధించకుండానే పాక్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

***ఫైనల్ కూడా పోయే***

హైబ్రిడ్ మోడల్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత్ ఫైనల్‌కు అర్హత సాధించడం వల్ల తుదిపోరు పాకిస్థాన్ నుంచి తరలిపోయింది. టీమ్ ఇండియా ఫైనల్‌కు వెళ్లడం వల్ల కరాచీలో జరగాల్సిన ఈ మ్యాచ్ దుబాయ్‌కు షిఫ్ట్ అయ్యింది. ఇది కూడా పీసీబీకి నష్టం కలిగించింది.

## ధోనీనే ఆల్‌టైమ్ బెస్ట్ ఫినిషర్

### - శశాంక్ సింగ్




*నాటి టీమిండియా దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై పంజాబ్ కింగ్స్ హిట్టర్ శశాంక్ సింగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ ప్రపంచంలోనే అత్యుత్తమ ఫినిషర్ మహేంద్ర సింగ్ ధోనీ అని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శశాంక్ సింగ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ధోనీని తొలిసారి కలిసినప్పుడు తనను గుర్తుపట్టాడని తెలిపాడు.*

*'ప్రపంచంలోనే అత్యుత్తమ ఫినిషర్ ధోనీ. ఆయనో దిగ్గజం. ధోనీని నేను తొలిసారి కలిసినప్పుడు ఆయన నన్ను గుర్తు పట్టారు. అది నాకు చాలా పెద్ద విషయం. ఎందుకంటే ధోనీలాంటి దిగ్గజ ఆటగాడికి మన పేరు తెలియడం కంటే మించిన గొప్ప విషయం ఏం ఉంటుంది. ఆయన నాకు కొన్ని సలహాలు ఇచ్చారు. అవి నాకు బాగా ఉపయోగప డ్డాయి.' అని శశాంక్ సింగ్ తెలిపాడు.*

*టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తనకు ఇష్టమని, అతని సారథ్యంలో ఆడటం తన కలని చెప్పాడు. 'ప్రతీ ఒక్కరు రోహిత్ శర్మ కెప్టెన్సీ గురించి సానుకూలంగా చెప్తారు. అతను ఆటగాళ్లకు అండగా ఉంటాడు. వారికి చాలా అవకాశాలు ఇస్తాడు. అతను చాలా తెలివైన కెప్టెన్. అతని ఫీల్డ్ సెటప్ చాలా ఫన్నీగా ఉంటుంది. నేను ఎవరి కెప్టెన్సీలోనైనా ఆడాలనుకుంటే అది రోహిత్ శర్మనే. అతను బోంబేకు చెందినవాడు. ఇప్పటికే అతనితో కలిసి ఒకసారి బ్యాటింగ్ చేసే అవకాశం దక్కింది. అప్పుడు ఆయన కెప్టెన్ కాదు. అతని సారథ్యంలో ఆడాలని ఉంది. అదే నా కోరిక'అని శశాంక్ సింగ్ చెప్పుకొచ్చాడు.*

*ఐపీఎల్ 2025 సీజన్‌లో శశాంక్ సింగ్ పంజాబ్ కింగ్స్ తరఫున బరిలోకి దిగనున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్లలో శశాంక్ సింగ్ సంచలన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. దాంతో అతన్ని పంజాబ్ కింగ్స్ రూ. 5 కోట్లకు తీసుకుంది.*

### భారత్-పాక్.. బెస్ట్ టీమ్ అదే..

## ఆయనే నా ఫేవరేట్ ప్లేయర్: ప్రధాని మోదీ

యావత్ క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తికరంగా చూసే భారత్-పాకిస్థాన్ దాయాదుల పోరుపై ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరు జట్లలో ఏది అత్యుత్తమ జట్టు అనేది ఫలితాలే నిర్ణయిస్తాయన్నారు. బెస్ట్ టీమ్ ఏదో ప్రత్యేకంగా తాను చెప్పాల్సిన అవసరం లేదని చెప్పారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న నరేంద్ర మోదీ.. భారత్-పాక్ పోరుతో పాటు క్రీడలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా భారత్, పాకిస్థాన్ జట్లలో బెస్ట్ టీమ్ ఏది? అని ప్రశ్నించగా.. తనదైన శైలిలో సమాధానమిచ్చారు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించిందని, ఈ ఫలితమే అత్యుత్తమ జట్టు ఏదో తెలియజేస్తుందని బదులిచ్చారు.

***నేను ఎక్స్‌పర్ట్ కాదు..***

'నేనేం క్రికెట్ ఎక్స్‌పర్ట్‌ను కాదు. ఈ గేమ్ టెక్నిక్ కూడా నాకు తెలియదు. నిపుణులు మాత్రమే ఈ విషయం చెప్పగలరు. కానీ కొద్ది రోజుల క్రితమే భారత్-పాక్ మధ్య మ్యాచ్ జరిగింది. ఆ ఫలితమే ఏ జట్టు అత్యుత్తమంగా ఉందో చెప్పింది. అది అందరికీ తెలుసు. క్రీడలకు మాత్రమే ఈ ప్రపంచాన్ని ఉత్తేజపరిచే శక్తి ఉంది. వివిధ దేశాల జనాలను క్రీడలు ఒకచోటికి చేర్చుతాయి.

అందుకే నేను క్రీడలను ఎప్పుడూ తక్కువ చూపు చూడను. మానవ పరిణామంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి. క్రీడలు కేవలం ఆటలు మాత్రమే కాదు. వివిధ దేశాల ప్రజల మధ్య సత్సంబంధాలు నెలకొల్పుతాయి. 'అని మోదీ తెలిపారు.

***భారత్‌లో మినీ బ్రెజిల్..***

భారత్‌లో ఫుట్‌బాల్‌కు ఫుల్ క్రేజ్ ఉందని మోదీ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఓ చిన్నపట్టణంలో ఫుట్‌బాల్‌కు ఉన్న ఆదరణ తనను ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పారు. 'మధ్యప్రదేశ్‌లో షాదోల్ అనే జిల్లా



ఉంది. ఇది పూర్తిగా గిరిజనుల ప్రాంతం. ఆ కమ్యునిటీనే ఎక్కువగా ఉంటుంది. నేను అక్కడికి వెళ్లినప్పుడు 80-100 మంది యువకులు, పెద్దవాళ్లు స్పోర్ట్స్ జెర్సీల్లో కనిపించారు. నేను వారిని చూసి ఎక్కడి నుంచి వచ్చారని అడిగాను. అందుకు వారు మినీ బ్రెజిల్ అని బదులిచ్చారు.

నేను కాస్త వివరంగా తెలుసుకునే ప్రయత్నం చేశాను. 'మా గ్రామంలో నాలుగు తరాలుగా ఫుట్‌బాల్ ఆడుతున్నారు. మా ఊరి నుంచి సుమారు 80 మంది జాతీయ స్థాయిలో ఆడారు. మా గ్రామం పూర్తిగా ఫుట్‌బాల్‌కు అంకితం'అని చెప్పారు. వారి ఊరిలో జరిగే వార్షిక ఫుట్ బాల్ మ్యాచ్‌కు ఇతర గ్రామాలు, జిల్లాల నుంచి 20 వేల నుంచి 25 వేల మంది ప్రేక్షకులు హాజరవుతారని తెలిపారు.'అని మోదీ చెప్పుకొచ్చారు.

***ఆయనే నా ఫేవరేట్..***

నచ్చిన ఫుట్‌బాల్ దిగ్గజం ఎవరని మోదీని ప్రశ్నించగా.. డియెగో మారడోనా అని తెలిపారు. '1980లో ఫుట్‌బాల్ ప్రపంచాన్ని మరడోనా శాసించారు. ఆ జనరేషన్‌కు ఆయనే హీరో. ఈ జనరేషన్‌ను అడిగితే లియోనల్ మెస్సీ పేరు చెబుతారు.'అని మోదీ బదులిచ్చారు.

## ఐపీఎల్‌లో బ్రూక్‌పై వేటు సరైందే..

### బీసీసీఐ నిర్ణయాన్ని సమర్థించిన మెయిన్ అలీ, ఆదిల్ రషీద్

ఐపీఎల్ నుంచి తప్పుకున్న ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ రెండేళ్ల నిషేధం విధించిన విషయం తెలిసిందే. బీసీసీఐ తీసుకొచ్చిన కొత్త రూల్ ప్రకారం.. వేలంలో ఎంపికైన తర్వాత లీగ క్కు అందుబాటులో ఉండాల్సిందే. లేదంటే రెండేళ్లు నిషేధం తప్పదని బోర్డు వేలానికి ముందే తెలిపింది. బ్రూక్ ఈ రూల్న అతిక్రమించడంతో వేటు పడింది. బ్రూక్ విషయంలో బీసీసీఐ తీసుకున్న నిర్ణయాన్ని ఇంగ్లాండ్క చెందిన క్రికెటర్లు మెయిన్ అలీ, ఆదిల్ రషీద్ సమర్థించారు. బ్రూక్పై వేటు సరైందేనని చెప్పారు. 'గతంలో చాలా మంది ఇలాగే చేశారు. తమకు నచ్చినప్పుడు తిరిగి వచ్చి బెటర్ ఫైనాన్షియల్ ప్యాకేజ్ పొందుతారు. కాబట్టి, బీసీసీఐ నిర్ణయం కఠినమైంది కాదు. నేను సమర్థిస్తున్నా. బ్రూక్ తప్పుకుని తన జట్టును గందరగోళానికి గురిచేశాడు. వారు ప్రతిదీ పునరుద్ధరించుకోవాలి.' అని మెయిన్ అలీ ఓ పాడ్కాస్ట్లో తెలిపాడు. ఆదిల్ రషీద్ కూడా బ్రూక్ చేసింది కరెక్ట్ కాదని వ్యాఖ్యానించాడు. 'వేలం కంటే ముందే ఆ రూల్ను తీసుకొచ్చారు. మీ పేరు ఇచ్చేటప్పుడే తప్పుకుంటే ఏం జరుగుతుందో మీకు తెలుసు. కాబట్టి, అతనిపై నిషేధం కఠినమైంది కాదు. 5-10 ఏళ్లలో చాలా మంది ఎంపికైన తర్వాత ఐపీఎల్ నుంచి తప్పుకున్నారు. అందుకే, ఆ రూల్ తీసుకొచ్చారు. 'అని రషీద్ చెప్పుకొచ్చాడు.










## నిధి ఛాలెంజ్ ఇదీ..!

పవన్ కళ్యాణ్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'హరిహర వీరమల్లు'. దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్న సినిమాకు సంబంధించి ఇప్పటికే పోస్టర్స్, వీడియో గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ సాంగ్, ఈమధ్యే బయటికొచ్చిన రెండో సింగిల్ 'కొల్లగొట్టినాదిరో' మంచి రెస్పాన్స్ సంపాదించాయి. రొమాంటిక్ మెలోడీగా వచ్చిన పాటలో పవన్ కళ్యాణ్ తనదైన వింటేజ్ స్టెప్పులతో ఇరగదీశాడు. ఇక అందాల భామ నిధి అగర్వాల్ ఈ పాటలో చాలా అందంగా కనిపించింది. కాగా తాజాగా నిధి అగర్వాల్ ఈ పాటకి రీల్ చేసి నెటిజన్లకు ఛాలెంజ్ విసిరింది. 'కొల్లగొట్టినాదిరో హుక్ స్టెప్ వేయడం నాకు చాలా నచ్చింది. మరి ఇప్పుడు మీవంతు వచ్చింది. నా రీల్ ఛాలెంజ్‌ని స్వీకరించండి. మీ డ్యాన్స్ మూమెంట్స్‌ను మాకు చూపించండి!' అంటూ నిధి అగర్వాల్ ఛాలెంజ్ విసిరింది. మరి ఈ ఛాలెంజ్‌ను నెటిజన్లు ఎలా స్వీకరిస్తారో చూడాలి. ఈ పాట చాలా క్యాచీగా ఉండటంతో ప్రేక్షకులకు ఇది బాగా కనెక్ట్ అయ్యింది. ఈ సినిమాకు ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## ఆత్మల కథతో అల్లరి నరేష్

కామెడీ చిత్రాలతో తనదైన ఇమేజ్ తెచ్చుకున్న హీరో అల్లరి నరేష్ ఇటీవలి కాలంలో తన పంథా మార్చాడు. వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న నరేష్, ఆ ప్రయత్నంలో మంచి విజయాలూ అందుకుంటున్నాడు. ఇక అల్లరి నరేష్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రానికి సంబంధించి తాజాగా ఓ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. అల్లరి నరేష్ ప్రస్తుతం '12ఏ రైల్వే కాలనీ' అనే ఓ హార్రర్ జోనర్ మూవీలో నటిస్తున్నాడు. ఈ సినిమాను పొలిమేర, పొలిమేర-2 చిత్రాల దర్శకుడు అనిల్ విశ్వనాథ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో అల్లరి నరేష్ స్టైలిష్ లుక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా టైటిల్ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. స్పిరిట్స్, ఆత్మలు కొందరికి ఎలా కనిపిస్తాయి.. అనే పాయింట్‌తో ఈ టైటిల్ టీజర్ ప్రారంభంలో చూపెట్టారు. ఇక ఈ సినిమాలో అల్లరి నరేష్ ప్రేక్షకులను పూర్తిగా భయపెట్టడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాలో కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి ప్రొడ్యూస్ చేస్తున్నారు. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు.

## వచ్చే సంక్రాంతికే చిరు స్టోరీ

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ రాబోతుంది. ఐతే, ఈ సినిమా 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు దర్శకుడు అనిల్ రావిపూడి క్లారిటీ ఇచ్చారు. నిన్న సింహాచలం లక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకున్న అనిల్ రావిపూడి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మెగాస్టార్‌తో తీయబోయే మూవీ స్క్రిప్ట్ స్వామి సన్నిధిలో పెట్టి పూజలు చేశాం. సినిమా కథలు రాయడానికి నేను వైజాగ్‌ను సెంటిమెంట్‌గా భావిస్తాను. అందుకే ప్రతి స్క్రిప్ట్ ఇక్కడే పూజలు చేయిస్తాను' అంటూ అనిల్ రావిపూడి చెప్పుకొచ్చాడు. ఇక ఈ చిత్రం షూటింగ్ జూన్‌లో ప్రారంభమవుతుందట. అన్నట్టు ఈ సినిమా గురించి ఆ మధ్య మెగాస్టార్ మాట్లాడుతూ.. 'ఈ సినిమా పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని.. ఈ మూవీ సెట్స్‌లో అడుగు పెట్టేందుకు తాను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను అని చెప్పుకొచ్చారు. సినిమా కచ్చితంగా అభిమానులకు నచ్చుతుంది అన్నది మెగాస్టార్ నమ్మకం. ఇక సాహు గారపాటి, సుస్మిత (చిరంజీవి కుమార్తె) సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తారని చిరు చెప్పడం తెలిసిందే.



## విజయ్ తమ్ముడిగా సత్యదేవ్?

విజయ్ దేవరకొండ లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ 'కింగ్‌డమ్'. టైటిల్‌తోనే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచింది. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్. సినిమా నుంచి రిలీజ్ అయిన గ్లింప్స్ వీడియోకు సెన్సేషనల్ రెస్పాన్స్ దక్కింది. ఇక సినిమాకు సంబంధించి తాజాగా ఫిల్మ్ ఇండస్ట్రీలో ఓ కథనం వినిపిస్తుంది. అది -వర్సటైల్ ఆర్టిస్టు సత్యదేవ్ కీలక పాత్ర చేస్తున్నాడన్నది ఆ కథనం. అయితే, సినిమాలో ఆయన



విజయ్ దేవరకొండకు సోదరుడి పాత్రలో కనిపిస్తాడని.. పాత్ర చాలా ఎమోషనల్‌గా ఉండబోతుందని తెలుస్తోంది. సత్యదేవ్ చేయడం ఖాయమేగానీ, పాత్ర అదేనా కాదా? అన్నది తెలియాల్సి ఉంది. ఇక ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నాడు.

## ఫౌజీ బోర్డులోకి కరీనా!

ప్రభాస్ హీరోగా డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో రాబోతున్న సినిమా ఫౌజీ. ఈ సినిమాను పీరియాడిక్ వార్ అండ్ లవ్ స్టోరీగా దర్శకుడు తెరకెక్కిస్తున్నాడు. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ కీలక పాత్రలో నటిస్తోందని, పైగా ఆమె యువరాణి పాత్రలో కనిపిస్తారని వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ చిత్రంలో మరో సీనియర్ హీరోయిన్ కూడా నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కథ ప్రకారం సెకండ్ హాఫ్‌లో వచ్చే ఈ పాత్ర సినిమాలో కీలక పాత్ర అని.. ఇప్పుడు ఈ పాత్ర కోసం బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్‌ను తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది. కాగా, సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో నటిస్తున్నాడని తెలుస్తోంది. ఇక బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నాడు. రీసెంట్‌గా ఆయన ఫౌజీ సెట్స్‌లో జాయిన్ అయ్యారు. అలాగే, సినిమాలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే హను రాఘవపూడి సినిమాని తెరకెక్కిస్తున్నాడు.



## హిమాలయాల్లో అఘోర ఎంట్రీ అద్భుతమట

బాలయ్య -బోయపాటి శ్రీను కాంబినేషన్లో వచ్చిన 'అఖండ' చిత్రం అద్భుత విజయాన్ని సాధించింది. దీంతో, 'అఖండ 2 తాండవం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఐతే, సినిమా పై ఇప్పుడు క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. సినిమాలో బాలయ్య ఇంట్రో సీన్ అదిరిపోతుందని.. అఘోర పాత్ర పోషిస్తున్న బాలయ్య, హిమాలయాల్లో శివలింగానికి అభిషేకం చేస్తూ ఆయన పాత్ర రివీల్ అవుతుందని తెలుస్తోంది. ఆ సమయంలో విజువల్స్ అద్భుతంగా ఉంటాయట. కాగా ఈ సినిమా మొత్తంలోనే ఈ ఇంట్రో సీన్ మెయిన్ హైలైట్ అవుతుందని అంటున్నారు. ప్రస్తుతం హిమాలయాల్లో కొన్ని ప్రదేశాల్లో బాలయ్య అఘోర పాత్రపై సన్నివేశాలను షూట్ చేస్తున్నారు. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. థమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. బోయపాటి శ్రీను -బాలయ్య కాంబినేషన్‌లో హ్యాట్రిక్ విజయాలు నమోదయ్యాయి. దీంతో 'అఖండ 2 -తాండవం'పై రెట్టింపు అంచనాలున్నాయి.

## ఆమెను అమ్మా అనే అంటా..

నందమూరి కళ్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం"అర్జున్ సన్నాఫ్ వైజయంతి". నటి, ఎమ్మెల్సీ విజయశాంతి ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తోంది. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ.. "తండ్రీకొడుకులు పలు విషయాల్లో గొడవ పడడం చివరకు ఒక్కటవడం చాలా సినిమాల్లో చూశాం. మా సినిమాలో.. ఎంతో ప్రేమగా ఉండే తల్లీకొడుకులు ఎందుకు దూరం కావాల్సి వచ్చింది? మళ్లీ ఎలా కలుసుకున్నారు? అనేదే కీలకం. కథలో తల్లి పాత్రలో విజయశాంతి మేడమ్‌నే ఊహించుకున్నాను. నేను ఆమెను పేరుతో పిలవను. మనస్ఫూర్తిగా అమ్మ అనే పిలుస్తాను' అంటూ కళ్యాణ్‌రామ్ చెప్పుకొచ్చారు. ఇదే ప్రమోషన్స్‌లో విజయశాంతి మాట్లాడుతూ.."సినిమా పరిశ్రమకు కల్యాణ్‌బాబు చాలామంది కొత్త దర్శకులను పరిచయంచేశారు. ఈ సినిమా విడుదలతర్వాత ప్రదీప్(దర్శకుడు)కు మరిన్ని అవకాశాలొస్తాయి. ఇక సినిమాలో కల్యాణ్‌రామ్ రాజీ పడకుండా నటించారు" అని విజయశాంతి తెలిపారు. ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్ సహా అశోక క్రియేషన్స్ వారు సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్నారు. అలాగే, ఈ చిత్రంలో కళ్యాణ్‌రామ్ సరసన సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుంది.

